
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
12-06-2024
సంపుటి : 01 | సంచిక : 39 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# కేసీఆర్‌కు నోటీసులు

## జారీ చేసిన జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్

- ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో జారీ
- జూన్ 15లోపు వివరణ ఇవ్వాలని కోరిన కమిషన్
- రిప్లై ఇవ్వకుంటే వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశం
- జులై 30 వరకు సమయం కోరిన కేసీఆర్
- మరో 25 మందికి నోటీసులు ఇచ్చామన్న జస్టిస్ నర్సింహారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:**


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు విషయంలో ఆయనకు మంగళవారం నోటీసులు అందాయి. ఈనెల 15లోగా వివరణ ఇవ్వాలంటూ జస్టిస్ నర్సింహారెడ్డి ఈ నోటీసులు జారీ చేశారు. కాగా విచారణకు హాజరయ్యేందుకు జూలై 30 వరకు సమయం కావాలని కేసీఆర్ కోరారు. మూడు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు.

మిగతా2లో...

# దటీజ్ చంద్రబాబు

## 40 ఏళ్ల రాజకీయాల్లో తనదైన ముద్ర

- నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- తెలుగు రాష్ట్రాల్లో బాబు లేని రాజకీయాలు లేవు
- సవాళ్లు, ఒడిదుడుకులతో పోరాటం
- ముఖ్యమంత్రిగా మార్క్ చూపించిన నేత
- కూటమిలో గెలుపునకు అద్భుతమైన వ్యూహాలు
- ఎన్డీఏ కూటమిలో కీలకంగా మారిన టీడీపీ



3

# నేటి నుంచి స్కూళ్లు ఓపెన్

- మారిన పాఠశాలల టైమింగ్స్
- 9 గంటల నుంచి 4 గంటల వరకు క్లాసులు
- హైదరాబాద్, సికింద్రాబాద్‌లో 8.45 గంటల నుంచి 3.45 గంటల వరకు..
- నేడు స్కూళ్లను పున:ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

2

# మంత్రులకు కేసీఆర్ కాన్వాయ్ కార్లు!

- ఒక్కో మంత్రికి ఒక్కో ల్యాండ్ క్రూజర్
- కేటాయించిన ప్రోటోకాల్ డిపార్ట్‌మెంట్
- గతంలో కొని విజయవాడలో పెట్టిన కేసీఆర్
- ఆ కార్లను మంత్రులకు ఇచ్చిన ప్రభుత్వం

2





# రామోజీరావుకు ప్రత్యామ్నాయం లేదు

## ఆయన వ్యక్తి కాదు.. వ్యవస్థ

- రామోజీ చూపిన మార్గంలోనే పని చేయాలి
- రామోజీ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి
- కుటుంబ సభ్యులకు సీఎం పరామర్శ
- ఫిల్మ్ సిటీలో రామోజీ చిత్రపటానికి ఘన నివాళి

**విశ్వంభర, హైదరాబాద్:**

రామోజీ గ్రూపు సంస్థల అధినేత, దివంగత రామోజీరావు కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఆయన నివాసానికి వెళ్లి.. రామోజీరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే వారి

మిగతా2లో...

## తెలంగాణ అభివృద్ధికి

# కృషి చేస్తా

- అక్కడ విమానయాన రంగానికి తోడ్పాటు అందిస్తా
- ప్రధాని మోదీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

3

# ఒడిశా సీఎంగా మోహన్ చరణ్ మాఝి



- ఖరారు చేసిన బీజేపీ అధిష్ఠానం
- నేడు సీఎంగా మోహన్ చరణ్ ప్రమాణస్వీకారం
- హాజరుకానున్న ప్రధాని మోదీ

2

# ఏ ఒక్క ప్రధాన హామీ నెరవేరలే

- ఆరు మాసాలు గడుస్తున్న సీఎం గప్‌చుప్
- కుర్చీ కాపాడుకోవడం కోసమే సమయం సరిపోతుంది
- ప్రజలను మోసం చేసినందుకు క్షమాపణలు చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేఎల్పీ నేత ఏలేటి విమర్శలు



**విశ్వంభర, హైదరాబాద్:** ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చిందని, ఆరు మాసాలు గడిచిన ఏ ఒక్క ప్రధాన హామీ నెరవేర్చలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం

మిగతా2లో...



## కేసీఆర్‌కు నోటీసులు

**(మొదటి పేజీ తరువాయి)**

మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు.

**టెండర్లు లేకుండానే విద్యుత్ కొనుగోళ్లు**

సోమవారం మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు. మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు. జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్కే జోషి, అరవింద్ కుమార్‌లతో మంగళవార సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రెగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్‌గఢ్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు.

**భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు**

భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని చెప్పారు. భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారని, కానీ రైల్వేలైన్ వెయ్యలేదని పేర్కొన్నారు.

## ఒడిశా సీఎంగా మోహన్ చరణ్ మాఝి

**విశ్వంభర, ఒడిశా:** ఒడిశా ముఖ్యమంత్రిగా ఆదివాసీ నేత మోహన్ చరణ్ మాఝి ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. అధిష్ఠానం నిర్ణయంతో బీజేపీ ఎమ్మెల్యేలంతా ఆయనను శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. దీంతో మోహన్ చరణ్ మాఝి నేడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. అలాగే డిప్యూటీ సీఎంలుగా కనకవర్ధన్ సింగ్, ప్రవతి పరిదాను హైకమాండ్ ఎంపిక చేసింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నారు.

**అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం**

ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ విజయదుందుభి మోగించింది. రెండున్నర దశాబ్దాలపాటు రాష్ట్రాన్ని పాలించిన బిజూ జనతాదళ్ తాజా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యింది. మొత్తం 147 అసెంబ్లీ స్థానాలకు గాను బీజేపీ 78 ,బిజు జనతా దళ్ 51, కాంగ్రెస్ 14, ఇతరులు 4 చోట్ల గెలుపొందారు. సీఎం అభ్యర్థి పేరును చెప్పకుండానే ఎన్నికల్లో ముమ్మర ప్రచారం చేసిన బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లను సాధించింది.

## రామోజీరావుకు ప్రత్యామ్నాయం లేదు



**(మొదటి పేజీ తరువాయి)**

కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రామోజీతో తనకు ఉన్న బంధాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. రామోజీరావు వ్యక్తి కాదు, వ్యవస్థ అని, ఆయనకు ప్రత్యామ్నాయం లేదన్నారు. రామోజీ చూపిన మార్గంలో వారి కుటుంబ సభ్యులు, సంస్థలు ప్రజల తరపున నిలబడాలని ఆకాంక్షించారు. రామోజీ రావు ఆలోచనా విధానాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అన్నారు. ఈనాడు ఎండీ కిరణ్, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ విజయేశ్వరితో కాసేపు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజ్ ఠాకూర్‌తో పాటు తదితర నేతలు ఉన్నారు.

## ఏ ఒక్క ప్రధాన హామీ నెరవేరలే

**(మొదటి పేజీ తరువాయి)**

బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ పేరుతో ముఖ్యమంత్రి హామీలు అమలు చేయకుండా తప్పించుకుని తిరిగారని వ్యాఖ్యానించారు. రెండు లక్షల రుణమాఫీ చేయకుండా.. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 65 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ కేవలం ఎనిమిది ఎంపీ సీట్లే గెలిచిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయిందని విమర్శించారు. 14 సీట్లు గెలుస్తామని, తమ పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండమని ముఖ్యమంత్రి చెప్పారని గుర్తు చేశారు. 14 సీట్లు గెలుస్తామని కేవలం 8 సీట్లే గెలిచినందుకు రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని అన్నారు. ప్రజలను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి క్షమాపణ డిమాండ్ చేశారు. తన కుర్చీ కాపాడుకోవడం కోసమే సమయం సరిపోతుందని ఆరోపించారు. ఐదు లక్షల విద్యా భరోసా కార్డు ఎప్పుడూ ఇస్తారో స్పష్టం చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామన్నారని, స్కూటీలు ఎప్పుడూ ఇస్తారని విద్యార్థినులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై రిటైర్డ్ జడ్జితో కమిటీ వేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ధరణి అవకతవకలను రాష్ట్ర ప్రజల ముందు ప్రభుత్వం ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఓట్ల కోసం ఎన్ని డ్రామాలు చేసిన కేవలం 8 సీట్లలో మాత్రమే ప్రజలు గెలిపించారని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎప్పటి వరకు అమలు చేస్తారో చెప్పాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 18న గవర్నర్ అపాయింట్ మెంట్ కోరానని.. పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు. హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిసి పౌరసరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై సీబిఐతో విచారణ జరిపించాలని కోరుతానని ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెప్పారు.

## నేటి నుంచి స్కూళ్లు ఓపెన్

**విశ్వంభర, హైదరాబాద్ :** విద్యాసంస్థలకు వేసవి సెలవులు ముగియడంతో నేటి నుంచి స్కూళ్లు తెరుచుకోనున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా బడిబాట ప్రారంభమైంది. జూన్ 19వ తేదీ వరకు కొనసాగనున్న ఈ బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే వచ్చే విద్యా, అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించనున్నారు. బడిబాట ప్రోగ్రాంలో భాగంగా జూన్ 12వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కూళ్లను పునఃప్రారంభించనున్నారు. అయితే ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు తమ పిల్లలను ఉదయం 8 గంటలకే పంపిస్తున్నారు. కానీ గవర్నమెంట్ స్కూళ్లను ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తుంటే ప్రజల్లో చులకన భావం ఏర్పడుతుందని భావించిన ఉన్నతాధికారులు భావించారు. ఈ నేపథ్యంలో గవర్నమెంట్ స్కూళ్లను కూడా ఉదయం 9గంటలకే ప్రారంభించడానికి విద్యాశాఖను సన్నద్ధం చేసింది. దీంతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9గంటలకే ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక పాఠశాలలు సాయంత్రం 4 గంటల వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు సాయంత్రం 4.15 గంటల వరకు నిర్వహిస్తారు. హైస్కూళ్లు మాత్రం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం అవుతాయి. హైదరాబాద్, సికింద్రాబాద్ లో మాత్రం ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 3.45 గంటల వరకే ఉంటాయి.

# ఆధారాలు చూపిస్తే క్షమాపణ చెప్తా

- ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారం
- యూట్యూబ్ ఛానల్స్ పెట్టి దుమ్మెత్తిపోస్తున్నారు
- బీఆర్ఎస్‌పై ఎమ్మెల్సీ బల్మూరి ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్:** ఆరోపణలు కాదు.. ఆధారలతో చూపిస్తే క్షమాపణ చెప్పడానికి సిద్ధమని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. కేటీఆర్ చేస్తున్న ప్రచారం అబద్ధమైతే ముఖ్యమంత్రికి క్షమాపణ చెప్పి ముక్కు నెలకు రాయాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వీడియో సందేశంలో మాట్లాడారు. సీఎంపై చేస్తున్న ఆరోపణలపై ఆధారాలు చూపిస్తే ఎమ్మెల్సీ వెంకట్ క్షమాపణ చెప్తానని తెలిపారు. సీఎంపై చేస్తున్న ఆరోపణలు నిజమని నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెప్పడానికి నేను సిద్ధం అన్నారు. కేటీఆర్ చేస్తున్న ప్రచారాలు అబద్ధమైతే ముఖ్యమంత్రికి క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాయాలని సవాల్ విసిరారు. ప్రభుత్వంపై పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టి దుమ్మెత్తి పోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి బీఆర్ఎస్ అఫీషియల్ అకౌంట్స్ లలో పెట్టి నిజమని నమ్మిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తప్పు చేస్తే విమర్శించండి అంతేగానీ.. తప్పుడు ప్రచారాలు చేయకండి అన్నారు. గురుకుల, ఏఈఈ అభ్యర్థులు ఆందోళన పడకండి అని తెలిపారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం విద్యార్థులను, నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా నా దగ్గరికి వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తా అన్నారు. పదిహేను రోజుల్లో మీ సమస్య పరిష్కరిస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు ఒక్కొక్కటి సరి చేస్తున్నామన్నారు. ఒక్క ఇబ్బంది కలగకుండా గ్రూప్ 1 పరీక్ష నిర్వహించామన్నారు. నీట్‌పై హైదరాబాద్ వేదికగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు.

# రెడ్ బుక్‌లో పేర్లు రాస్తున్నాం

- మీ బండారం బయట పెడతా
- ఫ్లై యాష్ తరలింపులో మంత్రి పొన్నం అక్రమాలు
- రోజుకు రూ.50 లక్షలు అక్రమంగా సంపాదిస్తుండు
- ఎన్టీపీసీ అధికారులు ఎందుకు చోద్యం చేస్తున్నారు
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




**విశ్వంభర, హైదరాబాద్:** రామగుండం ఫ్లై యాష్ తరలింపులో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భారీగా అక్రమాలకు పాల్పడ్డారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. బూడిద తరలింపులో మంత్రి అదనంగా రోజుకు రూ.50 లక్షలు అక్రమంగా సంపాదిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న 13 లారీలను తానే స్వయంగా పట్టుకున్నట్లు తెలిపారు. రవాణా శాఖ అధికారులు రెండు లారీలను మాత్రమే సీజ్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా ఎన్టీపీసీ అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు.

**రెడ్ బుక్‌లో పేర్లు.. మీ బండారం బయటపెడతాం**

అవినీతికి పాల్పడే అందరి పేరు రెడ్ బుక్‌లో రాస్తున్నామనని, తాము అధికారంలోకి వచ్చిన నాడు అందరి బండారం బయటపెడుతామన్నారు. ఇది బెదిరింపు కాదు, మీ బాధ్యత మీకు గుర్తు చేస్తున్నామని స్పష్టం చేశారు. అక్రమార్కులపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్లై యాష్ వల్ల బండి స్కిడ్ అయ్యి తన దగ్గరి మిత్రుడు అఖిల్ అనే వ్యక్తి మరణించాడని తెలిపారు. పేదోళ్ల శవాల మీద పైసల్ ఏరుకుంటున్న పొన్నం ప్రభాకర్‌కి అఖిల్ శాపం, పాపం ఖచ్చితంగా తగులుతుందని హెచ్చరించారు. అక్రమార్కులపై ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి

### గవర్నర్ నజీర్‌ను కలిసిన కూటమి నేతలు

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కూటమి నేతలు మంగళవారం భేటీ అయ్యారు. ఎన్డీఏ కూటమి పక్ష నేతగా చంద్రబాబు నాయుడును ఎన్నుకున్నామని గవర్నర్‌కు తెలియజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. మూడు పార్టీలకు చెందిన శాసనసభ్యులు ఏకగ్రీవంగా శాసన సభ పక్ష నేతగా చంద్రబాబును ఎన్నుకున్నట్లు వాళ్లు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో టీడీపీ తరుపున అచ్చెన్నాయుడు, జనసేన నుంచి నాదెండ్ల మనోహర్, బీజేపీ నుంచి పురంద్రీశ్వరి ఉన్నారు. ఇవాళ ఉదయం 11.27 నిమిషాలకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో సాయంత్రానికి గవర్నర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించనున్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి బండి సంజయ్

**విశ్వంభర, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయక మంత్రి బండి సంజయ్ హాజరుకానున్నారు. నేటి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు జీపీ నడ్డా, అమిత్‌షాలు కూడా రానున్నారు. ఇతర ఎన్డీఏ ముఖ్యనేతలు, ఇతర రాష్ట్రాల సీఎంలు పాల్గొననున్నారు. బండి సంజయ్ ఇవాళ దిల్లీ నుంచి విజయవాడ వెళ్లనున్నారు. తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేయగా భారీ మెజారిటీతో బండి సంజయ్ గెలుపొందారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు తొలిసారిగా కేంద్ర మంత్రి వర్గంలో చోటు ఇచ్చారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు సహాయ మంత్రిగా బీజేపీ ప్రభుత్వం బాధ్యతలు ఇచ్చింది. ఇవాళ దిల్లీ నుంచి నేరుగా విజయవాడ చేరుకుని రేపు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి హాజరవుతారు.

## నేడు ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఆయన ఎంపీలతో నేటి భేటీ అవుతున్నారు. విభజన హామీలు, రాష్ట్ర ప్రయోజనాలపై ఎంపీలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి 8 మంది గెలుపొందారు. నల్గొండ, ఖమ్మం, భువనగిరిలో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు.ఈ నెల 24 నుంచి పార్లమెంట్ సమావేశాలు ఉన్నాయి. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కొత్తగా ఎన్నికైన ఎంపీలకు సంబంధించి దిశానిర్దేశం చేసే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర విభజన జరిగి దాదాపు పదేళ్లు అవుతోంది. ఇంకా అనేక విభజన హామీలు పెండింగ్ లో ఉన్నాయి. వాటికి సంబంధించి ఎంపీలకు దిశానిర్దేశం చేసే అవకాశం ఉంది. విభజన హామీలు ఐటీఐఆర్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, తెలంగాణకు రావాల్సిన నిధులు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా.. ఈ అంశాలన్నింటిపై పార్లమెంట్ వేదికగా అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేసే ఛాన్స్ ఉంది. వీటన్నింటితో పాటు కొత్తగా ఎంపికైన ఎంపీలు ఉన్నారు. వారికి సంబంధించి ఏ విధంగా ముందుకెళ్లాలి? రాష్ట్రానికి సంబంధించిన ఏయే అంశాలపై పార్లమెంటులో ప్రస్తావించాలి? అనే దానిపై సీఎం రేవంత్ దిశానిర్దేశం చేయనున్నారు.

# సింగరేణి కార్మికులకు గుడ్ న్యూస్

- కారుణ్య నియామకాల వయోపరిమితి పెంపు
- అప్పర్ ఏజ్ లిమిట్ 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం



**విశ్వంభర, హైదరాబాద్:** సింగరేణి కారుణ్య నియామక ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారసుల గరిష్ఠ వయోపరిమితి 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వయో పరిమితి పెంపు ఉత్తర్వులు వెలువడ్డాయి. 2018 మార్చి 9 కటాఫ్ తేదీ నుంచి ఈ ఆదేశాలు అమలు చేస్తున్నట్లు సింగరేణి సీఎండీ వెల్లడించారు. ఈ ఉత్తర్వులతో 300 మంది నిరుద్యోగులు తక్షణమే లబ్ధి పొందనున్నారు.

**కార్మికుల సంక్షేమంపై దృష్టి**

సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించింది. కార్మికుల సంక్షేమంలో భాగంగా వారి కుటుంబాలకు విద్య, వైద్యం, ఇతర వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. ప్రమాదంలో గాయపడిన, మృతి చెందిన కార్మికులను, వారి కుటుంబాలకు రూ.కోటి బీమా సదుపాయాన్ని సంస్థ అందిస్తోంది. దీంతో పాటు సింగరేణి కార్మికుల పిల్లలకు అత్యున్నత ప్రమాణాలతో చదువులు అందించేందుకు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా సింగరేణి కార్మికుల పిల్లల కోసం నిర్వహిస్తున్న పాఠశాలలను ఆధునీకరించడం, డిజిటలీకరణతో పాటు స్టేట్ సిలబస్ స్థానంలో సీబీఎస్ఈసిలబస్ అమలు చేయాలని నిర్ణయించింది. సింగరేణి ఆధ్వర్యంలో నడుస్తున్న కాలేజీలను, ఇంజనీరింగ్ కాలేజీలను ఆధునీకరించాలని యాజమాన్యం నిర్ణయించింది.

# ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- దేశంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి
- గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్
- ఘనంగా తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం




**విశ్వంభర, ములుగు:** తెలంగాణ, జార్ఖండ్ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ మంగళవారం సిద్దిపేట జిల్లా ములుగులో జరిగిన శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్‌కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు. భారత స్థూల జాతీయోత్పత్తికి 18% పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రీయ వ్యవసాయానికి మద్దతు నిస్తుందని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70% పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని, కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక తిరగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. పెద్దగా ఆలోచించాలని వాటిని చేరుకునేందుకు ఆరంభం సైతం చేరువ అంతే పెద్దగా ఉండాలని అన్నారు. ప్రపంచంలో అబ్రహం లింకన్, నరేంద్ర మోడీ ప్రపంచంలో తనదైన ముద్ర వేశారని, పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని గవర్నర్ పేర్కొన్నారు. చదువుతో సహా ప్రతి అంశంలో నాణ్యతను చూపించినట్టయితే విజయం తథ్యమని అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు.

**విద్యార్థులకు బంగారు పతకాలు ప్రధానం**

బీఎస్సీ హానర్స్ హార్టికల్చర్‌లో అత్యధిక ఓజీపీఏ సాధించినందుకు గాను 2023 బ్యాచ్ కు చెందిన ఆర్. వరలక్ష్మి మూడు బంగారు పతకాలు అందుకున్నారు. బీఎస్సీ హానర్స్ ఫారెస్ట్రీలో పీసీసీఎఫ్ గోల్డ్ మెడల్ కె. రవళి; డీన్స్ గోల్డ్ మెడల్ కె. ప్రత్యూష అందుకున్నారు. ఎమ్మెస్సీ హార్టికల్చర్‌లో అన్ని విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఎస్కేఎల్‌టీఎస్‌హెచ్ గోల్డ్ మెడల్, అలాగే విద్యార్థినిలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను, ఇంకా కూరగాయల విభాగంలో టాపర్గా నిలిచినందుకుగాను గాను ఎం.మాళవిక మూడు గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. పండ్ల శాస్త్ర విభాగంలో జీఎస్ దివ్య, పూల శాస్త్ర విభాగంలో పీ. విద్య శ్రీ, అలాగే ఔషధ, సుగంధ ద్రవ్య పంటల విభాగంలో పి.మహేశ్వరి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.

**విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం:**

ఈ మూడవ స్నాతకోత్సవంలో 156 మంది కి ఉద్యాన డిగ్రీ, 50 మందికి ఫారెస్ట్ డిగ్రీ, 45 మందికి ఉద్యాన పీజీ, 30 మంది ఫారెస్ట్ పీజీ, అలాగే మరో ఆరుగురికి పీహెచ్డీ డాక్టరేట్ పట్టాలు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. నీరజ ప్రభాకర్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏ భగవాన్, డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డీఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్ రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ ఆర్కే మాథూర్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి కృషి చేస్తా



**విశ్వంభర, అమరావతి:** తెలంగాణలో విమానయాన రంగానికి తన వంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారుర. ఏపీ, తెలంగాణలో విమానయాన రంగాన్ని పరుగులు పెట్టిస్తానని వెల్లడించారు. తెలంగాణలో ఉన్న తెలుగు ప్రజల మనసు గెలుచుకునేలా పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలంటే 30 శాఖలు మన చేతిలో ఉండాలని, అయితే అది సాధ్యపడదని అన్నారు. కేంద్రంలోని అన్ని శాఖాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతానని తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని రికార్డు సమయంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అదే విధంగా విమానయాన శాఖలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై దృష్టిని సారిస్తామని వెల్లడించారు. గతంలో విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన జ్యోతిరాధిత్య సింధియాను కలిసి ఆయన అనుభవాలను తెలుసుకుంటానని పేర్కొన్నారు. ఏపీలో ఎయిర్‌పోర్ట్‌ల అభివృద్ధికి కృషి చేస్తా అంటున్నారు. పౌర విమానయాన శాఖ మంత్రి బాధ్యతలను ప్రధాని మోడీ ఏరి కోరి తనకు అప్పగించారని చెప్పారు. తనపై మోడీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతానని మీడియాతో చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో భారత దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించడంలో పౌర విమానయాన శాఖ పాత్ర చాలా ఉందన్నారు. యువకుడివి, విదేశాలు తిరిగావు, ఇంజనీరింగ్ విద్యాభ్యాసం ఉంది.. కాబట్టి ఈ శాఖను నీకు ఇస్తున్నాను అంటూ ప్రధాని మోడీ చెప్పారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు.

## జగన్‌కు చంద్రబాబు ఫోన్!

- ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని నిర్ణయం
- ఫోన్ లిఫ్ట్ చేయని జగన్‌మహన్ రెడ్డి



**విశ్వంభర, విజయవాడ:** ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఫోన్ చేశారు. తన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. ఈ మేరకు జగన్‌కు చంద్రబాబు ఫోన్ చేశారు. అయితే చంద్రబాబు ఫోన్‌కు జగన్ అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. దీంతో చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి వైఎస్ జగన్ హాజరు కావడం లేదని తెలుస్తోంది. నేడు ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోడీ పాటు పలువురు ప్రముఖులు కేంద్రమంత్రులు అమిత్ షా, బండి సంజయ్,పవన్ కల్యాణ్, స్టార్ హీరోలు చిరంజీవి, రజినీకాంత్‌లు హాజరవుతున్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి పరిమితంగానే వీవీఐపీల పాస్‌లు




**విశ్వంభర, హైదరాబాద్ :** ఏపీ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రధాని మోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు, సీఎంలు హాజరు కానున్నారు. అందుకు తగ్గట్టుగానే అధికారులు వీఐపీలు, వీవీఐపీల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, అటు అభిమానులు సైతం చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావడానికి ఉవ్విళ్లూరుతున్నారు. సామాన్య కార్యకర్తలు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో వారికి తగిన విధంగా ఏర్పాట్లు చేసిన అధికారులు అందుకు తగ్గట్లుగా వీఐపీ, వీవీఐపీల గ్యాలరీలకు మాత్రం పరిమిత సంఖ్యలో పాస్‌లను జారీ చేశారు.నియోజకవర్గానికి కేవలం 200 చొప్పున పాస్‌లు జారీ చేశారు. పాస్‌లను పరిమిత సంఖ్యలో జారీ చేసిన నేపథ్యంలో అటు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు పాస్‌ల కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తమకు తెలిసిన నేతల ద్వారా పాస్‌లు దక్కించుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కానీ, చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని నియోజకవర్గాని 200 వందల పాస్‌లు మాత్రమే జారీ చేశారనే విషయం తెలియని కూటమి నేతలు, పాస్‌ల కోసం నియోజకవర్గాల్లోని నేతల చుట్టూ తిరుగుతున్నారు. వారి ద్వారా పాస్‌లు పొందవచ్చని ప్రయత్నాలు చేస్తున్నారు. అభిమాన సందోహం భారీగా హాజరైతే ప్రమాణ స్వీకార ప్రాంగణం సరిపోయే పరిస్థితి లేదని కూటమి నేతలు ఈ నిర్ణయం తీసుకన్నట్లు తెలుస్తోంది.

# దటీజ్ చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి:** టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణం చేసిన వ్యక్తి. నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లో ఆయన లేని రాజకీయాలు లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో కూడా తనదైన మార్క్ పాలన చూపించారు. తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత కూడా ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవం ఆయనది. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో పద్నాలుగేళ్లు సీఎంగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండుసార్లు, రాష్ట్ర విభజన జరిగాక ఒకసారి కలిపి మొత్తం మూడు పర్యాయాలు సీఎంగా పనిచేసిన చరిత్ర ఆయనది. రాజకీయ ప్రస్థానంలో గెలుపు, ఓటములు రెండింటినీ చూశారు. నాలుగో సారి ముఖ్యమంత్రి కాబోతున్న చంద్రబాబు రాజకీయ ప్రయాణం అంతా ఆసక్తికరమే. విద్యార్థిగా రాజకీయాల్లోకి అడుగు పెట్టిన ఆయన ఎన్నో ఎత్తుపల్లాలు చూసి వచ్చారు. ఉద్ధండులతో కలిసి రాజకీయాలు చేశారు. 40 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లను కూడా దాటారు.

**రాజకీయ ప్రస్థానం**

1978లో తొలిసారి చంద్రబాబు శాసనసభకు పోటీ చేశారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదివే రోజుల్లోనే రాజకీయాల వైపు అడుగులు వేశారు. అప్పటి ఎమ్మెల్సీ రాజగోపాల్ నాయుడి ప్రోత్సాహంతో మెల్లమెల్లగా రాజకీయాల్లో అడుగుపెట్టాడు. ఎన్‌జీ రంగా అనుచరుడిగా పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికలలో ఇందిర కాంగ్రెస్ తరఫున చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. గాంధేయవాదిగా పేరున్న పట్టాభి రామ చౌదరిపై 2 వేల 494 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో చంద్రబాబుకు 35 వేల 92 ఓట్లు వచ్చాయి. అలాగే పట్టాభిరామ చౌదరికి 32వేల 598 ఓట్లతో ఓటమి పాలయ్యారు. అలా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. కొద్దికాలంలోనే టంగుటూరి అంజయ్య కేబినెట్‌లో మంత్రి అయ్యే అవకాశం వరించింది. సాంకేతిక విద్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమ, మైనర్ ఇరిగేషన్‌తో పాటు సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో సినిమా వాళ్లతో మంచి పరిచయాలు ఏర్పడ్డాయి. అప్పుడే ఎన్టీఆర్‌తోనూ సాన్నిహిత్యం ఏర్పడింది. అనంతరం ఎన్టీఆర్ చిన్న కుమార్తె భువనేశ్వరితో చంద్రబాబుకు వివాహమైంది. ఆ తర్వాత కొన్ని నెలలకు 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించగా.. చంద్రబాబు వెంటనే అందులో చేరలేదు. కాంగ్రెస్‌లోనే పలు దినాలు ఉన్నారు.

### తొలి సంతకం వీటిపైనే చేస్తారా!

చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సిద్ధమవుతుండడంతో.. ముఖ్యమంత్రిగా తొలి సంతకం దేనిపై చేస్తారని అందరిలో చర్చ మొదలైంది. ఈ క్రమంలోనే ప్రధానంగా మూడు ఫైళ్ల మీద సంతకం చేస్తాడని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీపై ఉండనున్నట్లు తెలిసింది. మెగా డీఎస్సీ అంటూ వైసీపీ మోసం చేసిందని తాము అధికారంలోకి రాగానే ఫస్ట్ సంతకం మెగా డీఎస్సీపైనే ఉంటుందని టీడీపీ పలు సభల్లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో తొలి సంతకం మెగా డీఎస్సీ మీదనే అని అంటున్నారు. అలాగే రెండో సంతకం పింఛన్ల పెంపు మీద ఉండే అవకాశం ఉంది. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే పింఛన్లు నాలుగు వేలకు పెంచుతామని, దీనిని ఏప్రిల్ నెల నుంచే అమలు ప్రకటించారు. ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు నెలకు వేయి చొప్పున అదనంగా రావాల్సిన పింఛన్‌ను కలిపి జూన్ నెల పింఛన్ 7 వేలు అందిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఎన్నికల హామీల్లో కీలకమైనది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. ఈ హామీపై మూడో సంతకం చేసే అవకాశం ఉందని పలువురు చర్చించుకున్నారు.



### ముఖ్యమంత్రిగా మార్క్ పాలన

చంద్రబాబు ముఖ్యమంత్రిగా తన మార్క్ పాలన సాగించారు. స్మార్ట్ గవర్నెన్స్, ఐటీ, ప్రజల వద్దకే పాలన, జన్మభూమి లాంటి కార్యక్రమాలతో ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఉమ్మడి రాష్ట్రానికి అధునాతన సాగు విధానాలు పరిచయం చేశారు. 1998లో హైటెక్ సిటీని ప్రారంభించి ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగం అభివృద్ధికి కృషి చేశారు. అంతర్జాతీయంగా పేరు ప్రతిష్టలు తెచ్చుకుని ఉత్తమ సీఎంగా పేరు తెచ్చుకున్నారు. అలా నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు 1999లో సొంతంగా ఎన్నికల బరిలోకి దిగారు. బీజేపీ మద్దతుతో 178 స్థానాలను ఆయన నాయకత్వంలోని టీడీపీ పార్టీ అందుకోగా.. రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. రెండో విడత పాలనలో చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచడం, రాష్ట్రంలో వర్షాభావం, కరవు పరిస్థితులతో ప్రజల్లో క్రమేణా వ్యతిరేకత పెరిగింది. 2000లో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో వామపక్షాలు, రైతులు చేపట్టిన నిరసన ప్రదర్శనపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు చనిపోవడం ప్రజాగ్రహానికి కారణమైంది. టెలీ కాన్ఫరెన్సులు, ప్రజల వద్దకే పాలన లాంటి కార్యక్రమాలతో ప్రభుత్వ ఉద్యోగులపై ఒత్తిడి పెరగడంతో మరింత వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ తర్వాత 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. నవ్యాంధ్ర తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఐదేళ్లు పాలన సాగించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ 151 సీట్లు సాధించగా.. 23 స్థానాలకే టీడీపీ పరిమితమైంది.

**రాజకీయాల్లో చక్రం తిప్పిన చంద్రబాబు**

అసెంబ్లీలో మద్దతు నిరూపించుకోవడానికి నెల రోజుల సమయమివ్వగా.. చంద్రబాబు అన్నీతానై చక్రం తిప్పారు. టీడీపీ ఎమ్మెల్యేలను వెంట పెట్టుకెళ్లి రాష్ట్రపతిని కలిసి ఎన్టీఆర్‌కు మద్దతు ప్రకటించారు. అత్యధిక మంది ఎమ్మెల్యేలను ఎన్టీఆర్‌కు మద్దతుగా చంద్రబాబు కూడగట్టడంతో బల నిరూపణకు ముందే నాదెండ్ల రాజీనామా చేశారు. ఆ తర్వాతే చంద్రబాబుకు ఎన్టీఆర్ మరింత ప్రాధాన్యమిచ్చారు. 1985లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో చంద్రబాబు పోటీ చేయకుండా టీడీపీ కోసం పనిచేశారు. 1989లో చంద్రగిరి నియోజకవర్గాన్ని వీడి కుప్పం బరిలో నిలిచి విజయం అందుకున్నారు. అయితే, టీడీపీ ఓడిపోవడంతో ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి వెళ్లడానికి ఎన్టీఆర్ ససేమిరా అన్నారు. చంద్రబాబుకు ప్రతిపక్ష నేత బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 1994 ఎన్నికల్లో టీడీపీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ రెండో భార్య లక్ష్మి పార్వతి జోక్యం పెరుగుతోందన్న ఆరోపణలతో చంద్రబాబు, ఎన్టీఆర్ కుమారులు కొందరు తిరుగుబాటు చేశారు. చంద్రబాబు తన మామ ఎన్టీఆర్‌పై అవిశ్వాసం ప్రకటించి ముఖ్యమంత్రి అయ్యారు. ఈ పరిణామాన్ని ఉద్దేశించే వెన్నుపోటు అంటూ చంద్రబాబును ఆయన వ్యతిరేకులు ఇప్పటికీ వ్యతిరేకిస్తుంటారు.

**పెండింగ్ అంశాలు త్వరలోనే పూర్తి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. గతంలో ఉన్న జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వం పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి నప్పటికీ పెద్దగా పరిష్కారం కాలేదు. అయితే ఎన్డీఏ కూటమిలో చేరడంతో ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో చంద్రబాబు కేంద్రంలో అత్యంత కీలకంగా మారారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఏపీకి సంబంధించి పలు ముఖ్య అంశాలపై దృష్టి సారించి త్వరితగతిన కేంద్రం నుంచి పరిష్కారం రాబట్టే అవకాశం కనిపిస్తోంది. ఇందులో కొన్ని అంశాలను గమనిస్తే 2014 జూన్ నుంచి మూడేళ్లపాటు తెలంగాణ రాష్ట్రానికి ఏపీ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసింది. దీనికి సంబంధించిన రూ.7,230 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వెంటనే చెల్లించేలా కేంద్రం తరఫున తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకోవచ్చే అవకాశం చంద్రబాబుకు ఉందని సమాచారం. అదే విధంగా పోలవరం ప్రాజెక్ట్‌కు రావాల్సిన నిధుల విషయంలో త్వరితగతని అడుగులుపడే అవకాశం ఉంటుంది. ఈ విషయంలో ఏపీ శాఖల వద్ద ఫైల్స్ పెండింగ్ లో ఉన్నాయో.. ఆయా శాఖలతో మాట్లాడి పనులను మరింత మరింత వేగవంతం చేసే అవకాశం ఉంది. మరో కీలకమైన అంశం రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా సహా మరికొన్ని హామీల అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అంశం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అమరావతి పనులు మళ్లీ వేగవంతం కావటంతో కేంద్రం నుంచి నిధులు రాబట్టే అవకాశం ఉంది. కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులతో పాటు తగిన సహాయ సహకారాలపై చర్చించే అవకాశం ఉంది. భోగాపురం, భీమిలి, రుషికొండ, విశాఖపట్నం పోర్టులను కలిపే ఆరు లైన్ల రహదారి పనులు వేగవంతంతో పాటు మరికొన్ని జాతీయ ప్రాజెక్టులపై దృష్టి సారించే చాన్స్ ఉంది. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు వీలైనంత త్వరగా ఆమోదం తెలిపేలా కేంద్రాన్ని ఒప్పించే డిమాండ్లు కూడా పెట్టొచ్చు.

### బాబు వ్యూహాలకు ఎన్టీఆర్ ఫిదా

టీడీపీ తొలిసారి పోటీ చేసినప్పుడు 1983లో జరిగిన ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బాబు పోటీ చేశారు. టీడీఈ అభ్యర్థి మేడసాని వెంకట రామ నాయుడు చేతిలో పరాభవం ఎదుర్కొన్నారు. ఈ ఓటమి తర్వాత ఆయన టీడీపీలో చేరారు. తెలుగుదేశంలో చంద్రబాబు పనితీరు ఎన్టీఆర్‌ను మెప్పించింది. నాదెండ్ల భాస్కరరావు తిరుగుబావుటా ఎగురవేసిన సమయంలో బాబు వేసిన పైఎత్తులు, అనుసరించిన రాజకీయ వ్యూహాలు ఆకట్టుకున్నాయి. ఆ తర్వాత ఎన్టీఆర్ భారీ ఆధిక్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసినా 1984లో అనూహ్యంగా అధికారం కోల్పోయారు. 1984లో ఎన్టీఆర్ వైద్యం కోసం అమెరికా వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కరరావు కొందరు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకుని ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయంలో నాదెండ్ల తన క్యాంపులోని ఎమ్మెల్యేలతో గవర్నర్‌ను కలిసి సీఎం అయ్యారు.

### జాతీయ రాజకీయాల్లో హవా

మొన్నటి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో 164 స్థానాల్లో కూటమి జెండా ఎగురవేసింది. దీంతో చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తిరుగులేని విజయం సాధించడంతో ఆయన ఫుల్ జోష్‌లో ఉన్నారు. అంతేకాకుండా టీడీపీ 16 ఎంపీ సీట్లు గెలవడంతో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలోనూ బాబుకు అధిక ప్రాధాన్యత లభిస్తోంది. ఎందుకంటే నరేంద్ర మోడీ 3.0 ప్రభుత్వంలో ఎన్డీయే మిత్రపక్షాలది ఈసారి కీలకపాత్ర కానుంది. బీజేపీకి స్వయంగా మెజార్టీ లేకపోవడమే కాకుండా ఎన్డీయేకు మేజిక్ ఫిగర్ కంటే కొద్దిగా ఎక్కువ సీట్లు రావడమే ఇందుకు కారణం. ఈ క్రమంలో టీడీపీ మరోసారి కీలకం అయ్యింది. దీంతో మరోసారి బీజేపీ సారధ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యంగా నితీష్ కుమార్ సారధ్యంలోని జేడీయూ, చంద్రబాబు సారధ్యంలోని తెలుగుదేశం పార్టీలు ప్రధానంగా కన్పిస్తున్నాయి. ఈ రెండు పార్టీల ఎంపీ సీట్లు మినహాయిస్తే ఎన్డీయే మేజిక్ ఫిగర్ 272 కు తగ్గిపోతుంది. అందుకే ఈ రెండు పార్టీలు ఇప్పుడు కేంద్రంలో చక్రం తిప్పనున్నాయి. గతంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో చక్రం తిప్పిన చంద్రబాబుకు మళ్లీ ఆ అవకాశం వచ్చింది.టీడీపీకి 16 ఎంపీ సీట్లు, మిత్రపక్షం జనసేనకు 2 మొత్తం 18 సీట్లతో ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్య పాత్ర పోషించే అవకాశం ఉంది.

**అన్న క్యాంటీన్లపై మరింత ఫోకస్**

ఏపీలో గత చంద్రబాబు పాలనలో పేదలకు రూ.5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రికి భోజనం లేదా ఫలహారం అందించిన అన్న క్యాంటీన్లు పేదలకు గుర్తుండిపోయాయి. పనులు చేసుకునే వారికి నిత్యం వివిధ వృత్తుల్లో ఉన్నవారికి, విద్యార్థులకు, హాకర్లకు ఈ క్యాంటీన్లు అత్యంత కారు చౌకకే కడుపు నింపాయి. అయితే.. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పనిగట్టుకుని ఈ క్యాంటీన్లను తీసేశారు. దీంతో పేదలకు కడుపు మండింది. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడ, తిరుపతి, విశాఖ, గుంటూరు, అనంతపురం వంటి కీలకమైన 12 నగరాల్లో 350 క్యాంటీన్లు పనిచేశాయి. వీటిని ఇస్కాన్ సంస్థకు అప్పగించిన విషయం తెలిసిందే. పేదల నుంచి రూ.5 తీసుకుని మిగిలిన సొమ్ములో 50 శాతం ప్రభుత్వం, మిగిలిన సొమ్మును ఆయా నగర పాలక సంస్థలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో అన్నా క్యాంటీన్లు నిర్విఘ్నంగా సాగిపోయాయి.

ప్రమాణ స్వీకారం చేసే రోజు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో అప్పట్లో ఏర్పాటు చేసిన పాయింట్లలోనే 100 క్యాంటీన్లను ప్రారంభిం చాలని టీడీపీ నాయకులు నిర్ణయించారు. తద్వారా ఎన్నికల్లో ఇచ్చిన అన్నా క్యాంటీన్లను తిరిగి తెరుస్తామన్న హామీని నిలబెట్టుకునే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. తాజాగా నటసింహం బాలయ్య పుట్టిన రోజు సందర్భంగా ఓ క్యాంటీన్‌ను అధికారికంగా ప్రారంభించారు. బాలయ్య మూడోసారి వరుసగా విజయం దక్కించుకున్న నియోజకవర్గం హిందూపురంలో సోమవారం అన్నా క్యాంటీన్‌ను టీడీపీ నాయకులు ప్రారంభించారు. సుమారు 200 మంది పేదలకు మధ్యాహ్నం నుంచి ఉచితంగానే అన్నం వడ్డించారు. ఈ నెల 12 నుంచి హిందూపురం మున్సిపల్ అధికారులు నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా 100 క్యాంటీన్లను ప్రారంభించనున్నారు.

# చంద్రబాబు ప్రమాణ స్వీకారం..

- తరలిరానున్న బీజేపీ అగ్ర నేతలు
- మోడీ, అమిత్ షా, నడ్డా హాజరు
- స్పెషల్ ఫ్లయిట్‌లో మెగాస్టార్ ఫ్యామిలీ

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ సీఎంగా చంద్రబాబు నాయుడు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీనికి పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు. ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ప్రమాణ మహోత్సవంలో పాల్గొంటారు. పలువురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, పార్టీల అధ్యక్షులు చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలి రానున్నారు. నేటి ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ విజయవాడ చేరుకుంటారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా కూడా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలు.. ఇవాళ రాత్రి చంద్రబాబు నివాసానికి రానున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుకు ముందు రోజే అమరావతి వస్తున్న అమిత్ షా.. ఇవాళ రాత్రి 10.30కు చంద్రబాబును కలవనున్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఇరువురు నేతల భేటీ జరగనుంది. ఢిల్లీ నుంచి రాత్రి 9.30 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్ట్ వచ్చిన అమిత్ షా, నడ్డా. అక్కడి నుంచి నేరుగా చంద్రబాబు నివాసానికి వెళ్తారు. చంద్రబాబుతో భేటీ అనంతరం 11.20 గంటలకు నోవాటెల్ హోటల్ లో రాత్రికి బస చేస్తారు. నేటి ఉదయం నోవాటెల్ నుంచి బయలుదేరి కేసరపల్లిలో జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అమిత్ షా, నడ్డా అటెండ్ అవుతారు.

**గన్నవరం ఎయిర్ పోర్టు కళకళ**

చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవానికి వీఐపీలు తరలి వస్తున్నారు. వారి రాకతో గన్నవరం ఎయిర్ పోర్టు కళకళలాడుతోంది. రద్దీగా మారింది. బేగంపేట్ ఎయిర్ పోర్ట్ నుండి స్పెషల్ ఫ్లైట్ లో చిరంజీవి కుటుంబం విజయవాడ చేరుకుంది. చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు హాజరవుతున్న నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయంలో ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర నేతలు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి నేతృత్వంలో పరిశీలన చేస్తున్నారు.

**అతిథులకు చంద్రబాబు విందు**

నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. బుధవారం ఉదయం 11 గంటల 27 నిమిషాలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గన్నవరం సమీపంలోని ఐటీ పార్క్ లో ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు చేశారు. 7వేల మంది పోలీసులు పహారా కాస్తున్నారు. గన్నవరం, కేసరపల్లి జంక్షన్ రూట్లన్నీ పోలీసు బలగాలతో నిండిపోయాయి. వీవీఐపీలు విజయవాడకు తరలివస్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డా రాత్రికి రాబోతున్నారు. వీరందరికి చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో రాత్రికి విందు ఇవ్వబోతున్నారు.



# అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా గాజాపై జరుగుతున్న దాడిని ఆపాలి





> "ప్రపంచ శాంతి స్థాపన కోసం పాటుపడిన ప్రఖ్యాత సైంటిస్ట్ "బెంజిమేన్ ఫ్రాంక్లిన్" ఒక సందర్భంలో 'యుద్ధం-శాంతి' గురించి విశ్లేషిస్తూ " మంచి యుద్ధం-చెడ్డ శాంతి" అనేది ఎక్కడ ఉండదని ప్రపంచమంతటా శాంతి ప్రగతి ఫరిడవిల్లాలని చెప్పిన విలువైన మాటలు అందరికీ ఎప్పటికీ అనుసరణీయమేనని మరువకూడదు.

మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం యొక్క చెడు అనుభవాల లోతైన గాయల నుంచి ప్రపంచం ఇంకా కోలుకొనేలేదు. యుద్ధం ఎవరు చేసినా.. ఏ దేశం చేసినా అది ప్రపంచ మనవహక్కులపై, దేశ సార్వబౌమధికారంపై దాడిగానే భావించాలి.

పాలస్తీనా ప్రజలు దశాబ్ధాలుగా, పాలస్తీనా దేశ భూభాగాన్ని ఆక్రమించుకుంటున్నఇజ్రాయల్ సామ్రాజ్య వాదానికి, అక్రమితవాదానికి, యుద్ధోన్మదవాదానికి వ్యతిరేకంగా, దైర్యసాహసాలతో పోరాడుతున్నారు. దేశం కోసం నెత్తురోడుతున్నారు, త్యాగాలుచేస్తున్నారు. అయినప్పటికీ ఇజ్రాయిల్, దశాబ్దాలుగా ఆరిపోని అగ్ని జ్వాలలను గుర్పిస్తునే వుంది. లక్షాలాది ప్రజల ప్రాణాలను బలిగొంటున్నది. ప్రగతి నిర్మాణాలు, శ్రమైక జీవన సౌందర్యాన్ని, ప్రజల జీవితాలు, హక్కులు, సంక్షేమం, విజ్ఞానం, వినోదం అన్ని ఇజ్రాయిల్ ఆక్రమిత యుద్ధాలోచనలతో బలైపోతున్నాయి. దశాబ్దాలుగా పాలస్తీనా, ఇజ్రాయిల్ మద్యన జరుగుతున్న యుద్ధం ఒక ఎత్తైతే, 2023 అక్టోబర్ 7న, హమాస్, ఇజ్రాయిల్ మీద చేసిన దాడి అనంతరం, ఇజ్రాయిల్, పాలస్తీనా మీద చేస్తున్న ఏకపక్ష, రాక్షస దాడులు మరొక ఎత్తుని చెప్పవచ్చు.

ఇజ్రాయిల్ చేసిన ఏక పక్ష దాడులతో 'గాజా' అతలకుతలమౌతుంది. వైమానిక దాడులను, తీవ్రతరం చేసింది. అక్టోబర్ నెల నుంచి ఆగని దాడుల, మానవత్వాన్ని మరిచిపోయాయి. పాఠాశాలలు, దవఖానాలు, ఆలయాలు, శరణార్ధి శిబిరాలమీద కుడా ఇజ్రాయిల్ నిర్ధాక్షిణ్యంగా, యుద్ధ నియమాలకు వ్యతిరేకంగా, పాశవిక దాడులను కొనసాగిస్తునేవుంది. ఈ దాడులవలన గాజాలోని బేకరీలు, సరకుల దుఖాణాల వద్ద సరకులు లేని పరిస్థితి, డాక్టర్లు, నర్సులు లేక వైద్య వ్యవస్థ, సదుపాయులు లేక రవాణ స్తంబించిపోయి, విద్యుత్ సరఫరా నిలిచిపోయి గాజా ప్రజలు చిన్నారులు, యువకులు, విద్యార్థులు, వృద్ధులు అని రంగాలవాళ్ళు ఆకలితో అలమటిస్తూ.. ప్రతిక్షణం మృత్యువు దగ్గరవుతున్నారు. భయంతోనే భతుకుతున్న ధీనపరిస్థితులు నెలకొని ఉన్నాయని పత్రికలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఆహారం, తాగునీరు, ఇంధనం ఇతర సదుపాయాలను ఇజ్రాయిల్ సైన్యం నిలిపివేసింది. హాస్పిటల్స్ లో విద్యుత్ లేక ఇంక్యుబేటర్లలో ఉన్న పసిపిల్లలు, దాడుల్లో గాయాల పాలైన ప్రజలకు ఆక్సిజన్ మరియు అవసరమైన వసతులు లేక మృతి చెందుతున్న దుస్థితి. రోజురోజుకూ పరిస్థితులు చాలా ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇజ్రాయిల్ దాడులు ప్రారంభమైన మొదటి నుంచి ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరికల నేపథ్యంలో పాలస్తీనీయులు ఉత్తర "గాజా" నుంచి దక్షిణ ప్రాంతాల వైపు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్ళిపోతున్న పరిస్థితులు బాధాకరం. ఇజ్రాయిల్ వైమానిక దాడుల వలన గాజాలో 1300 పైగా భవనాలు నేలమట్టమయ్యాయి, 55000 నివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని గతంలోనే ఐక్యరాజ్య సంబంధిత అనుబంధ సంస్థ తెలియజేసింది.

ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమెన్ నేతన్యాహు, గాజా సమీపంలోని తమ దేశ సైన్యాన్ని సందర్శించి వారిలో యుద్ధోత్సాహాన్ని నింపారు. అంతేకాదు తమ యుద్ధం రెండవ దశకు చేరిందని ఇది ఆరంభం మాత్రమే శత్రువును భూమి మీదే కాదు లోపల నుంచి నాశనం చేస్తాం అని, ఇది సుదీర్ఘ పోరుమాతృభూమి రక్షణ కోసం పోరాడుతున్నాం. సముద్రం, భూమి, గగనతల నుంచి దాడులు చేద్దాం, గెలవడమే లక్ష్యంగా పోరాటం సాగిద్దాం " అని నేతన్యాహు సైనికులతో చెప్పటం ఐక్యరాజ్యసమితిని, అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, ప్రపంచ మానవ హక్కులను బాధ్యతారహితంగా నిర్లక్ష్యం చేసినట్లని సభ్య సమాజం భావిస్తుంది.

ఇజ్రాయిల్ దాడిలో కొద్దిరోజులకే పాలస్తీనీయులు 2215 మంది మరణించారని, 8714 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆందోళన తెలిపింది. ఒక్క స్విచ్ఛ్ ఆన్ చేయనీయం, ఒక్క పంపు తిప్పనియం, ఒక్క ఇంధన ట్రక్కును కదలనివ్వం అంతేకాదు, హమాస్ బందీలుగా ఉన్న ఇజ్రాయిల్లను క్షేమంగా ఇంటికి పంపకపోతే గాజాకు ఎలాంటి సౌకర్యాలు అందబోవని ఇజ్రాయిల్ ఇంధ్ర శాఖ మంత్రి కట్జ్ తేల్చి చెప్పిన కటువైన మాటలను ఎవరూ మర్చిపోలేదు. హమాస్‌ను తుడిచి పెట్టేంత వరకు విశ్రమించబోనని ఇజ్రాయిల్ నిర్ణయించుకుంది. గాజా చుట్టూ అదనపు బలగాలను మోహరించింది. మూడు లక్షల అరవై వేల మంది రిజర్విస్టలను రంగంలోకి దింపింది .

ఇలాంటి యుద్ధ పరిస్థితుల్లో ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న పాఠశాలలో వేలాదిమంది శరణ కోరుతున్న తీరు హృదయాలను కదిలిస్తుంది. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులపై ప్రపంచ దేశాలు తమ గొంతును విప్పాయి. ఇజ్రాయిల్ దాడులను ఆపాలని హెచ్చరించాయి. ఆ క్రమంలోనే గాజుపై ఇజ్రాయిల్ దాడులను ఆపకపోతే పశ్చిమాసియా అంతటా హింసాకాండ విస్తరిస్తుందని ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరబ్దుల్లహీన్ హెచ్చరించాడు.

హమాస్ దాడులకు ప్రతీకారంగా గాజాపై యుద్ధం ప్రకటించిన ఇజ్రాయిల్ చాలా క్రూరమైన పద్ధతులను అనుసరిస్తుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. గాజా స్ట్రిప్ స్వాధీనానికి ఇజ్రాయిల్ చర్యల క్రమమంలో మధ్య తూర్పులో పరిణామాల వెనుక లాజిక్‌ను అర్థం చేసుకోగలనని గతంలో లెనిన్ గ్రాడ్ స్వాధీనానికి నాజీ జర్మనీ చేసినట్లుగానే తాజా పరిస్థితిలు ఉన్నాయని, ఇది ఆక్షేపనీయమైనదని పుతిన్ తెలిపారు. ఇజ్రాయిల్ ఆకస్మిక దాడులను ఎదుర్కొంది రెండు వైపులా ఘర్షణ స్థితి ఉంది, అయినా గానీ పౌరుల గురించి ఆలోచించడం ముఖ్యమన్నది నా అభిప్రాయం అని పుతిన్ అన్నారు.

ఇదిలా ఉండగా.., ఇజ్రాయిల్ దండయాత్రను వ్యతిరేకిస్తూ పాలస్తీ నాకు ప్రపంచ దేశాలు తమ మద్దతును ప్రకటిస్తూ.., నిరసన ర్యాలీలు, సభలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే న్యూయార్క్ లోని టైమ్స్ స్క్వేర్, మాన్‌హట్టన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇరాక్, లెబనాన్, ఇండోనేషియా, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఈజిప్ట్, యూరప్‌లో పాలస్తీనాకు మద్దతు తెలుపుతూ వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి కదం తొక్కుతున్నారు.

పాలస్తీనాకు మద్దతు ఇస్తాం ఆక్రమణ అంటే ఉగ్రవాదం అని గాజాపై దాడులని తక్షణమే ఆపాలని అమాయక ప్రజల మారణ హోమానికి అంతం పలకాలని ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు నిలిపివేయాలని, అమెరికాకు సామ్రాజ్యవాదమే ఇజ్రాయిల్ బలమని "అమెరికన్ ముస్లిమ్స్ ఫర్ పాలస్తీనా నాయకులు కూడా తమ మద్దతును తెలియజేయడం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు, పాలస్తీనాకు మద్దతుగా బలమైన సంఘీభావ ప్రదర్శనలు, సభలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి.

గతంలో ఐక్యరాజ్యసమితి చేసిన ఒప్పందం ప్రకారం పాలస్తీనాకు 45% భూభాగాన్ని, ఇజ్రాయిల్ కు 55% విభాగాన్ని అనుభవించే హక్కు ఉంది. ఈ ఒప్పందాన్ని మాత్రమే కాదు తూర్పు జెరూసలెం రాజధానిగా 1967 సంవత్సరం నుంచి పూర్వం ఉన్నటువంటి హద్దుల ప్రకారం పాలస్తీనాను ఐక్యరాజ్యసమితి ప్రకటించాలని, దాన్ని అమలు చేయాలని తద్వారా ఇరు దేశాలలో శాంతిని నెలకొల్పాలని పాలస్తీనాతో పాటు ప్రపంచ దేశాలు కోరుకుంటున్నాయి.

ప్రపంచ దేశాల సూచనలను భేఖాతరు చేస్తూ ఇప్పుడు కూడా ఈనెల మొదటి వారం నుంచి సెంట్రల్ గాజా ప్రాంతంపై ఇజ్రాయిల్ ఆర్మీ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్ చేసిన దాడిలో 33 మంది మరో శిబిరంలో 18 మంది ప్రాణాలను కోల్పోయారు.


ఇజ్రాయిల్ దాడిని మానవాళికి వ్యతిరేకంగా జరుగుతున్న నేరంగా అభివర్ణిస్తూ.., దాడిని తక్షణం ఆపాలని ఐక్యరాజ్యసమితిలో పాలస్తీనా ప్రతినిధి, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటేరాస్కు విజ్ఞప్తి చేశారు. మరొకవైపు గాజుపై ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని, దిగ్బంధనం తొలగించాలని, పాలస్తీనాలోని ఆస్పత్రులకు అత్యవసర మందులను సరఫరా చేసేందుకు తక్షణమే మానవతా కారిడార్ను ఏర్పాటు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఇజ్రాయిల్‌ను కోరిన విషయాన్ని కూడా మానవతా వాదులు ఎవరు కూడా మర్చిపోలేని విషయం.

ఈ పరిణామాల మీద ఐక్యరాజ్యసమితి స్పందిస్తూ గాజాలో యుద్ధ నేరాలు తీవ్రస్తాయిలో జరుగుతున్నాయని ఇజ్రాయిల్, హమాస్ మధ్య పోరులో అంతర్జాతీయ చట్టం తీవ్రస్థాయిలో అతిక్రమణకు గురవుతున్నట్లు, అక్రమిత పాలస్తీనా భూభాగాల దర్యాప్తు కమిషన్ వెల్లడించింది. యూఎన్ఓ ప్రకటించింది. హింసను ఆపేందుకు, సుస్తిర శాంతిని నెలకొల్పేందుకు ఏకైక మార్గం పాలస్తీనా భూభాగం పై కొనసాగుతున్న అక్రమ ఆకుపేషన్‌ను నిలిపివేయడంతోపాటు పాలస్తీనా ప్రజల స్వీయ నిర్ణయం హక్కు పరిరక్షణ అనివార్యమని కమిషన్ చెప్పినట్లు ఐక్యరాజ్యసమితి కూడా వెల్లడించింది. ఈ దాడిని ఐక్యరాజ్యసమితి "జాతి" అణిచివేత యుద్ధం అనే భావనలో ఉంది. కానీ అది "జాతి" నిర్మూలన యుద్దంగా కొనసాగుతున్నట్లు అనేక దేశాలు నమ్ముతున్నట్లు మేధావులు చర్చల ద్వారా బహిర్గతమవుతుంది.

అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు కొనసాగిస్తున్నంత కాలం గాజాలో కానీ, మరో ప్రాంతంలో కానీ మరణాలు, ప్రగతి విధ్వంసం కొనసాగుతూనే ఉంది, పాలస్తీనా న్యాయపోరాటం సాగుతూనే ఉంది. ప్రపంచ దేశాలు పాలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తుంటాయి.


భారతదేశం మొదటి నుంచి పాలస్తీనా పోరాటానికి మద్దతునిస్తుంది, అది అంతర్జాతీయ విధానం, కానీ ఇటీవల పాలస్తీనా పై భారతదేశం అంతర్జాతీయ విధానం నుంచి ప్రక్కకు మళ్ళింది, ఇజ్రాయిల్ వైపు చూస్తుంది ఇప్పుడైనా భారత ప్రభుత్వం పునరాలోచించి అలీన విధానాన్ని, పాలస్తీనా పట్ల మన సంఘీభావాన్ని దృఢంగా అమలు చేయాలి.

ప్రపంచ శాంతి సంఘాలు, మేధావులు, విద్యార్థులు, యువకులు, కార్మికులు, మహిళలు, డాక్టర్లు, లాయర్లు శాస్త్రవేత్తలు అంతా మళ్ళీ బలమైన పోరాటాలతో "ప్రపంచ శాంతి" సాధనకు కృషి చేయాలి.



- కేవీఎల్
రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి
అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం-హైదరాబాద్
CELL: 9490952649

# కేంద్రంలో చక్రం తిప్పనున్న చంద్రబాబు



చంద్రగ్రహణం వీడింది. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు, దక్షిణాది ప్రజలకు మంచి రోజులు రాబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్లో వైసిపి పార్టీ జగన్మోహన్ రెడ్డినీ చిత్తుచిత్తుగా ఓడించిన ఎన్డీఏ కూటమిది ఒక ఎత్తు అయితే.. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించడం మరొక ఎత్తు. వైయస్ జగన్మోహన్ రెడ్డినీ కేవలం 11 స్థానాలకే పరిమితం చేసి సర్వేలకు, విశ్లేషలకు, రాజకీయ పండితులకు, ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అందని స్థాయిలో ఎగ్జాక్ట్ పోల్స్ లో సత్తా చాటిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి చరిత్ర తిరగ రాసిందని చెప్పవచ్చు.

సరిగ్గా 20 సంవత్సరాలు తర్వాత చంద్రబాబు నాయుడు దేశం దృష్టినే కాక ప్రపంచదృష్టిని ఆకర్షించాడు. కారణం బీజేపీ 240 స్థానాల వద్ద ఆగిపోవడం.. అతిపెద్ద రెండవ పార్టీగా ఎన్డీఏలో టీడీపీ నిలవడం కారణం. ఏర్పడబోయే ప్రభుత్వంలో కచ్చితంగా చంద్రబాబు నాయుడు చక్రం తిప్పే అవకాశం ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే అందరి చూపు అటు ఎన్డీఏ, ఇటు ఇండియా కూటమిలచూపు బాబుపై పడింది.

అటు ఎన్డీఏ నేతలు ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా చంద్రబాబుతో మాటామంతి జరిపితే కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు కేసీ వేణుగోపాల్ లాంటి వారు చంద్రబాబుకి టచ్ లోకి వచ్చారు.



233 స్థానాలకే పరిమితమైన ఇండియా కూటమి మ్యాజిక్ ఫిగర్‌కు చాలా దూరంగా ఉండడం, ఎన్డీఏ కూటమికి 293 స్థానాలు వచ్చినప్పటికీ చంద్రబాబు నాయుడుతో కలిసి వస్తారనే ఆశ. అంతలోనే తాము కూడా ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామంటూ చంద్రబాబు నితీష్ కుమార్‌లు మా పాత మిత్రులే అంటూ రాహుల్ గాంధీ సైతం ముక్తాయించారు.

చంద్రబాబు గతంలో కూడా వాజ్ పేయి నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీఏకి సంపూర్ణ మద్దతు తెలిపారు. బెదిరింపులు, డిమాండ్లు లేకుండా బేశరతుగా ప్రభుత్వానికి అండగా నిలిచారు. ఇప్పుడు కూడా మోడీకి అదే ధీమా. చంద్రబాబు ఒకసారి కమిట్ అయితే ఇక వెనుతిరిగి చూడరనే ధీమాతో మోడీ సర్కార్ ముందుకు కొనసాగే అవకాశం ఉంది.

**నాడు శపథం - నేడు విజయం**

ఇన్నేళ్లు పరువు కోసం బతికాను. అలాంటిది.. ఈరోజు సభలో నా భార్య ప్రస్తావన తెచ్చి అసభ్య వ్యాఖ్యలు చేశారు. ఇది గౌరవ సభ కాదు.. కౌరవ సభ. ఇలాంటి సభలో నేను ఉండను, మళ్ళీ ముఖ్యమంత్రి గానే సభలో అడుగు పెడతాను, లేకపోతే నాకు రాజకీయాలే వద్దు, మీ అందరికీ నమస్కారం అంటూ సభ నుంచి వెళ్లిపోయారు.

**2021 నవంబర్ 19 న**

**శాసనసభలో భీషణ ప్రతిజ్ఞ ఇది.**

ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసినవాడు చంద్రబాబు.. అందుకే నామమాత్రంగా ఉన్న బీజేపీతో సైతం పొత్తు పెట్టుకున్నాడు. అదే.. ఈరోజు ఏపీలో చంద్రబాబుకు జరిగిన ఉపయోగం కంటే కేంద్రంలో బీజేపీ నేతృతంలో ఏర్పడిన ప్రభుత్వానికి ఆక్సిజన్ అని చెప్పవచ్చు. 2004 వరకు కేంద్రంలో చక్రం తిప్పిన చంద్రబాబు సరిగ్గా 20 సంవత్సరాల తర్వాత మరోసారి ఢిల్లీలో చక్రం తిప్పబోతున్నారు.ఔ

**ఎక్కువ కాలం కొనసాగిన ముఖ్యమంత్రులు**

సిక్కింలో 24 సంవత్సరాల 6 నెలలు చామ్లింగ్ సీఎంగా చేశారు, పశ్చిమబెంగాల్‌కు జ్యోతిబసు 24 సంవత్సరాలు, ఒడిసాకు నవీన్ పట్నాయక్ 24 సంవత్సరాలు, త్రిపురకు మాణిక్ సర్కార్ 20 సంవత్సరాలు, మధ్యప్రదేశ్‌కు శివరాజ్‌సింగ్ చౌహాన్ 19 సంవత్సరాలు, ఛతీస్‌గడ్‌కు రామణ్‌సింగ్ 15 సంవత్సరాలు, గుజరాత్‌కు నరేంద్రమోదీ 15 సంవత్సరాలు, అస్సాంకు గోగోయ్ 15 సంవత్సరాలు, ఢిల్లీకి షీలాదీక్షిత్ 15 సంవత్సరాలు, ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగారు.



డాక్టర్ మందడి భరత్ రెడ్డి
రాజకీయ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్ట్
హైదరాబాద్. ఫోన్ : 9052116339

# ఘనంగా ముగిసిన ఆటా 2024 కన్వెన్షన్ వేడుకలు

**విశ్వంభర, ఆమనగల్లు :** అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో అట్లాంటా నగరంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న ఆటా 2024 కన్వెన్షన్ తెలుగు ప్రజలను అలరించాయని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ ఆటా కన్వెన్షన్‌లో నిర్వాహకులచే ఏర్పాటు చేయబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రవాస భారతీయులను అలరించాయని మరియు బిజినెస్ ఫోరం, ఉమెన్ ఎంపవర్మెంట్ ఫోరం, పొలిటికల్ ఫోరం, ఎన్నారై కమిటీ ఫోరం, కల్చరల్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమల ద్వారా విద్యార్థులకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను, యువకులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన, వ్యాపారస్తులకు పెట్టుబడులపై అవగాహన ఆటా కల్పించినట్లు తెలిపారు. మూడు రోజులపాటు అట్టహాసంగా నిర్వహించబడిన ఆటా 2024 కన్వెన్షన్ ఆదివారంతో ముగిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆటా 2024 కన్వెన్షన్‌ను అట్టహాసంగా నిర్వహించిన ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని, మాజీ అధ్యక్షులు కరుణాకర్ ఆసిరెడ్డి, కన్వెన్షన్ డైరెక్టర్ అనిల్ బోదిరెడ్డి, ఆటా బోర్డ్‌ఆఫ్ ట్రస్టీ కిషోర్ గూడూరులను కలిసి ఎల్ఎన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆటా కన్వెన్షన్ ప్రవాస భారతీయులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.





## మేయర్‌కు కార్పొరేటర్ దొడ్ల వినతి

**విశ్వంభర, కూకట్ పల్లి:** శేర్లింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ 124వ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ మంగళవారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని మేయర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. బాంబే కాలనీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేయర్ సానుకూలంగా స్పందించి, అత్యవసరమైన పనులను త్వరితగతిలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, సంతోష్ బిరాదర్ తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా ఎన్నికైన లెక్చరర్స్ కాలనీ

- సంక్షేమ సభ్యులకు అభినందనలు
- జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహ్మా రెడ్డి

**విశ్వంభర, మన్సూరాబాద్ :** మన్సూరాబాద్ డివిజన్, కాస్మోపాలిటన్ కాలనీలో GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్వగృహంలో నూతనంగా ఎన్నికైన లెక్చరర్స్ కాలనీ సంక్షేమ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి అనునిత్యం కాలనీ వాసులకు అందుబాటులో ఉంటానని ఏదైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కాలనీ సంక్షేమ సభ్యులకు అభినందనలు తెలిపి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతపల్లి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, రవి కుమార్, కోశాధికారి సంతోష్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, సుదర్శన్, రఘునాథ్ రెడ్డి, నర్సింహా రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు పాల్గొన్నారు.

## మున్సిపల్ బిల్ కలెక్టర్ చేతివాటం

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు



**విశ్వంభర, ఘట్కేసర్ :** మున్సిపల్ బిల్ కలెక్టర్ రూ.3 కోట్లు కాజేయగా అతనిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిన సంఘటన ఘట్కేసర్ మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీసుల వివరాల ప్రకారం.. ఘట్కేసర్ మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా కొంపల్లి హేమంత్ కుమార్ 2007 నుంచి పనిచేస్తున్నాడు. అతను మున్సిపాలిటీలో రోజువారి పనులు ట్రేడ్ లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సంబంధించిన డబ్బులు వసూలుచేసి ఘట్కేసర్ మున్సిపాలిటీకి చెందిన బ్యాంక్ అకౌంట్లో జమ చేయడం అతని బాధ్యత. కానీ హేమంత్ కుమార్ మాత్రం మున్సిపాలిటీకి చెందిన డబ్బులు 2021నుంచి 2023 వరకు సుమారు మూడు కోట్ల రూపాయలు మున్సిపల్ అకౌంట్లో జమ చేయలేదు. దానికి సంబంధించి 2023లో ఆగస్టులో ఆడిటింగ్ జరగగా మున్సిపల్ డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ కాలేదని తేలింది. దీంతో హేమంత్‌ను 2023లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు ఉద్యోగం నుంచి తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సాబీర్ హాలీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మున్సిపల్‌కు సంబంధించిన డబ్బులను ఒక పబ్లిక్ సర్వెంట్‌గా ఉంటూ దుర్వినియోగం చేశాడని అభియోగంపై మంగళవారం పోలీసులు హేమంత్ కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



## కాంగ్రెస్ వీరాభిమాని..

- చెప్పులు లేకుండా 3000 కిలోమీటర్లు పాదయాత్ర

**విశ్వంభర, హైదరాబాద్ :** ఒంటి నిండా కాంగ్రెస్ కండువాలు.. చేతిలో కాంగ్రెస్ జెండా.. కాళ్లకు కనీసం చెప్పులు లేవు.. సుమారు 3వేల కిలోమీటర్లు చెప్పులు లేకుండా పాదయాత్ర చేస్తున్నాడు. అతడే సదాశివాలేఖర్. ఆయన కాంగ్రెస్ పార్టీకి వీరాభిమాని. అయితే, సదాశివాలేఖర్ ఏఐసీసీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ తెలంగాణ నేత జగ్గారెడ్డికి ఎదురుపడ్డాడు. ఆ వ్యక్తిని జగ్గారెడ్డి ఆరాతీయగా తన స్వస్థలం మహారాష్ట్రలోని షిర్డీ అని తెలిపాడు. తాను మణిపూర్ నుంచి బాంబే వరకు రాహుల్ గాంధీ యాత్రలో పాల్గొన్నానని తెలిపాడు. అది విన్న జగ్గారెడ్డి ఆశ్చర్యానికి లోనయ్యారు. పూర్తి వివరాలు అడగగా తాను సాదాసీదా రైతునని, కాంగ్రెస్ పార్టీకి వీరాభిమానినని చెప్పుకొచ్చాడు. ఇంత శ్రమ పడటం ఎందుకు అని జగ్గారెడ్డి అడగగా.. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు ఇలాగే ఆయన వెంట తిరగాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే వ్యవసాయానికి మేలు జరుగుతుందని, రైతులకు మంచి రోజులు వస్తాయని సదాశివాలేఖర్ తెలిపాడు. రైతులకు ఇప్పటి వరకు మేలు చేసింది కాంగ్రెస్సేనని, రాహుల్ ప్రధాని అయితే రైతులతో పాటు అన్ని వర్గాలకు అండగా ఉంటారని జగ్గారెడ్డితో అన్నాడు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి ఆయనను అభినందించారు.

## మిసెస్ వరల్డ్ ప్రైడ్ ను గెలుచుకున్న నితాన్య

**విశ్వంభర, బషీర్ బాగ్ 11:** మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2024 – సీజన్ 2 అందాల పోటీలు లీలా యాంబియన్స్ గుర్గావ్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌కు చెందిన నిత్యాన్య టీఏం మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2024, సీజన్ 2లో మిసెస్ వరల్డ్ ప్రైడ్ అనే ప్రతిష్టాత్మక అవార్డును గెల్చుకుంది. ఈ ఘనత నితాన్య అసాధారణ పయనమైన స్థితిస్థాపకత, సంకల్పం వ్యవస్థాపక విజయానికి నిదర్శనం. మిసెస్ వరల్డ్ ఇంటర్నేషనల్ 2024 సీజన్ 2 గ్రాండ్ ఫినాలే ఉత్కంఠ భరితంగా కొనసాగింది. ఈవెంట్‌కు ఫ్యాషన్, వినోద రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. గ్లామర్ గురావ్, బర్ఖా నాంగియా, మిస్టర్ అభిషేక్ నంజియా దార్శనిక వ్యవస్థాపకులు, డైరెక్టర్లు నిర్వహించిన ఈ ఈవెంట్ ప్రపంచవ్యాప్తంగా వివాహిత స్త్రీల అందం, తెలివితేటలు ధైర్యాన్ని హైలైట్ చేస్తూ.. వారి విభిన్న విజయాలను అందుకుంది. నితాన్య నితి బ్రాండ్‌కు వ్యవస్థాపకురాలుగా కొనసాగుతున్నారు.





## ప్రజావాణికి హాజరైన మంత్రి సీతక్క

**విశ్వంభర,హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌ను పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డితో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు, అధికారులకు వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ డ్రైవర్ కమ్ ఓనర్ అసోసియేషన్ సభ్యులు ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలల్లో పెరిగినందున ప్యాకేజీ పెంచాలని కోరారు. అన్ని విభాగాలకు సంబంధించి మొత్తం 702 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 219 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 54, హోం శాఖకు సంబంధించి 52, హౌసింగ్ శాఖకు సంబంధించి 44, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 46, ఇతర శాఖలకు సంబంధించి 287 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి, మున్సిపల్ శాఖ సంచాలకులు శ్రీమతి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించండంతోపాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## యువకులను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలి



- కర్తాల్ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్

**విశ్వంభర, ఆమనగల్లు :** కడ్తాల్ మండలంలోని బటర్ఫ్లై సిటీ వెంచర్లో గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన యువకులు ఇటీవల హత్యకు గురయ్యారు. హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని కడ్తాల్ మండల జజడ్పీటీసీ దశరథ్ నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ డిమాండ్ చేశారు. వారు మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించి, అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ నుంచి రెండు కుటుంబాలకు 5 వేల రూపాయల చొప్పున పదివేల రూపాయలు, వైస్ ఎంపీపీ ఆనంద్ మరో పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కోఆర్డినేటర్ వీరయ్య, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ ఎల్లా గౌడ్, శారద పాండు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఛార్జిషీట్

- మార్చి 10 న కేసు నమోదు చేసిన అధికారులు
- మొత్తం ఆరుగురిపై అభియోగాలు
- నేడు బెయిల్ పిటిషన్లపై తీర్పు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు మార్చి 10న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికి నిందితులుగా ఉన్న నలుగురు పోలీసులను అరెస్టు చేయగా.. నిందితులుగా మాత్రం ఆరుగురి పేర్లను చేర్చారు. అరెస్టు అయిన నలుగురిలో ఇప్పటి వరకు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్ రావును పోలీసులు అరెస్టు చేశారు.

**నేడు బెయిల్ పిటిషన్లపై తీర్పు**

మరోవైపు, భుజంగరావు, తిరుపతన్నలు తమకు బెయిల్ ఇవ్వాలని నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తమను రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని, ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించలేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే వారిని ఇంకా విచారించాల్సి ఉన్నందున బెయిల్ మంజూరు చేయవద్దని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. ఇద్దరి బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. ఈ విషయంలో నాంపల్లి కోర్టు తీర్పును నేడు వెల్లడించనుంది.



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి నివాసంలో మంగళవారం ఆయనను కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు మర్యాదపూర్వకంగా కలిశారు. - విశ్వంభర, హైదరాబాద్

## జడ్పీటీసీ దశరథ్ నాయక్ హెచ్చరికతో కడ్తాల్ కస్తూరిబాలో విద్యుత్ మీటర్ ఏర్పాటు



**విశ్వంభర, ఆమనగల్లు :** రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుంచే బడులు పున: ప్రారంభం అవుతుండడంతో కడ్తాల్ మండల కేంద్రంలోని కస్తూరిబా నూతన భవనంలో విద్యుత్ అధికారులు విద్యుత్ సప్లై ఇవ్వకపోవడంతో స్థానిక జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ విద్యుత్ అధికారులపై సీరియస్ అయ్యారు. 24 గంటల్లో నూతన భవనంలో కరెంట్ సప్లై చేయకుంటే 1000 మందితో కడ్తాల్ మండల కేంద్రంలో విద్యుత్ సబ్స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ జనరల్ బాడీ మీటింగ్‌లో ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన కలెక్టర్ వెంటనే అధికారులను హెచ్చరించడంతో హుటాహుటిన విద్యుత్ అధికారులు కస్తూరిబా నూతన భవనంలో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి విద్యుత్ అందించారు. తన మాటలను గౌరవించిన విద్యుత్ అధికారులను జడ్పీటీసీ అభినందించారు.



## విద్యుత్ ఉద్యోగుల యూనియన్ సర్వసభ్య సమావేశం

- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎనుమల శ్రీధర్

**విశ్వంభర షాద్‌నగర్ :** షాద్‌నగర్ డివిజన్ విద్యుత్ శాఖలోని ఉద్యోగుల సంఘం 327 యూనియన్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎనుమల శ్రీధర్ హాజరయ్యారు. అలాగే షాద్‌నగర్ డివిజన్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక చేశారు. డివిజన్ అధ్యక్షుడిగా ప్రతాప్ రెడ్డి, కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గా శ్రీనివాసు మరియు కమిటీ సభ్యులుగా రాందాస్, రమేశ్, యాదగిరి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డిస్కం అధ్యక్షులు సురేష్ కుమార్, కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

- జడ్పీటీసీ అనురాధ నాయక్

**విశ్వంభర, ఆమనగల్లు :** రంగారెడ్డి జిల్లా పరిషత్ జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్ జడ్పీటీసీ అనురాధ పత్య నాయక్ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, యూనిఫాం, బూట్లు అంటూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర దోపిడీ చేస్తున్నారని ఆమనగల్ జడ్పీటీసీ ఆరోపించారు. సరిగ్గా విద్యాబోధన కూడా చేయని, నిబంధనలకు విరుద్ధంగా వ్వహరిస్తున్ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి డీఈఓ కార్యలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



## ఇండ్ల మధ్యలో నిర్మిస్తున్న ఎయిర్‌టెల్ సెల్ టవర్‌ను తొలగించాలి

- షాద్‌నగర్ మున్సిపల్ మేనేజర్‌కు వినతి

**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు రతన్ కాలనీలో ఇండ్ల మధ్యలో ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మిస్తున్నారని ఆ సెల్ టవర్‌ను తొలగించాలని షాద్‌నగర్ మున్సిపల్ మేనేజర్ నయుంకు కాంగ్రెస్ నాయకులు నడికుడ యాదగిరి యాదవ్ వినతి పత్రం అందజేశారు. ఈ సెల్ టవర్ నిర్మాణం వల్ల వచ్చే రేడియేషన్‌తో తీవ్ర అనారోగ్యాలకు గురవుతారని, చిన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు మరియు గర్భిణులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే ఇండ్ల మధ్యలో ఉన్న టవర్‌ను తొలగించి ప్రజల ప్రాణాలు కాపాడాలని వారు కోరారు.




## ఓయూలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**విశ్వంభర, సికింద్రాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏ విద్యార్థులతో చెలగాటం ఆడుతుందని ఎన్ఎస్యూఐ ఓయూ అధ్యక్షుడు మేడ శ్రీను పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే పేపర్ లీకేజీ కి కారణం అన్నారు. నీట్ పేపర్ లీకేజీ అయిందంటూ ఎన్ఎస్యు ఐ ఆధ్వర్యంలో మంగళవారం ఓయూలో రాస్తారోకో నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మేడ శ్రీను మాట్లాడుతూ ఒకే సెంటర్లో సీరియల్ గా ఆరుగురు విద్యార్థులకు ర్యాంక్ రావడం పేపర్ లీకేజీకి నిదర్శనం అన్నారు. పేపర్ లీకేజీ పై జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి, అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న ఎన్ఎస్యుఐ నాయకులను ఓయూ పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.



## అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

- కమిషనర్ జి. రాజేంద్రకుమార్

**విశ్వంభర, కీసర :** అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జి. రాజేంద్ర కుమార్ అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నాగారం మున్సిపాలిటీ లోని రాంపల్లి లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న 3 షెడ్లు, 2 సెల్లార్ లు, నాగారంలో 1 షెడ్డు అక్రమ నిర్మాణాలను ఎక్స్ కవేటర్ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఊపేక్షించబోమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ కావ్య, మున్సిపల్ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజల భద్రతే లక్ష్యం

- ఎస్సై రాజేందర్ రెడ్డి

**విశ్వంభర,ఝు రాసంగం:** ప్రజలకు పూర్తిస్థాయి భద్రత కల్పించడమే పోలీసుల లక్ష్యమని ప్రయాణికులు ఆటో ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఝురా సంగం ఎస్సై రాజేందర్ రెడ్డి అన్నారు. పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో స్థానిక ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను అంటించారు. ప్రయాణికులు ఆటోలో ప్రయాణం చేసేటప్పుడు డ్రైవర్ వెనకాల అంటించిన స్టిక్కర్ ను క్యూఆర్ కోడ్ ఫోటో తీసుకుని పెట్టుకోవాలని ఎస్సై రాజేందర్ రెడ్డి ప్రయాణికులకు సూచించారు.



## నేడు పాలేరు, ఖమ్మం నియోజకవరాల్లో మంత్రి పొంగులేటి పర్యటన

**విశ్వంభర, ఖమ్మం రూరల్ :** తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల్లో బుధవారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 06.30గంటలకు 59వ డివిజన్ దానవాయిగూడెంలో మున్నేరు ప్రొటెక్షన్ వాల్స్ పనులను సందర్శిస్తారని తెలిపారు. 10గంటలకు 60వ డివిజన్ రామన్నపేటలోని జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలోని ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో అభివృద్ధి పథకాలపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సమీక్షిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్, పాటివారిగూడెం, జాన్ బాద్ తండా , పడమటి తండా, దారేడు తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారని తెలిపారు. కావున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పొంగులేటి పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

# ధరణి ఆన్ లైన్ ప్రక్రియలో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవు

### జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి



**విశ్వంభర, కొత్తగూడెం:** ప్రజలంటేనే ప్రభుత్వమని ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరవేసే విధంగా ప్రజాప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గం లోని ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత మనపైన ఉందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం ఐ డి ఓ సి కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్ష సమావేశం, పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొని ప్రజా పాలన సక్రమంగా పరిపాలించడానికి ఈ ప్రభుత్వం మీద నమ్మకంతో మమ్మల్ని ఎన్నుకోవడం జరిగిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లా అధికారులు నియోజకవర్గంలోని శాసనసభ్యులను సంప్రదించి నియోజకవర్గంలోని సమస్యలను తప్పనిసరిగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరించాలని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు, త్రాగునీరు, విద్యా, వైద్యం, గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, కల్వర్టులు మీద ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అలాగే అర్హులైన వృద్ధులకు, వికలాంగులకు, వితంతు మహిళలకు, ఒంటరి మహిళలకు, ఆసరా పింఛన్లు అందేలా చూడాలని, అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గ్రామపంచాయతీలలో మౌలిక వసతుల కల్పన, రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడి స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో ఏమైనా రిపేర్లు ఉంటే సాధ్యమైనంత తొందరగా పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అన్నారు. ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు ప్రజలకు సేవ చేయడానికి విధులు నిర్వహిస్తున్నారని, తప్పనిసరిగా ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో 39 వేల కోట్లు ఖర్చు చేసిన గ్రామాలలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, మా ప్రభుత్వం వచ్చాక మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని అన్ని గ్రామాలలోని ప్రతి ఇంటికి మంచినీరు అందే విధంగా చర్యలు చేపట్టామని, గిరిజన గ్రామాలలో నిర్మాణం చేపట్టే రోడ్లు ఫారెస్ట్ వారు అడ్డంకులు సృష్టిస్తే దానికి సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించి అన్ని గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం కల్పించాలని, భద్రాచలం కొత్తగూడెం డివిజన్లలో 30 శాతం కంటే ఎక్కువ నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పనులు ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శపాఠశాల పనులు త్వరగా పూర్తిచేసి పిల్లలకు ఇబ్బంది కలగకుండా పండుగ వాతావరణంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులను సంప్రదించి పాఠశాలలను ప్రారంభోత్సవం చేయాలని, అదే రోజు పిల్లలకు బుక్స్, యూనిఫామ్ మిగతా మెటీరియల్ అందజేయాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలోని గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలను పిల్లలకు మొదటి విడతగా తెలుగు లో విద్యాబోధన ప్రారంభించామని, రాబోయే రోజుల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడానికి రాష్ట్రంలో 650 కోట్లు పైచిలుకు డబ్బులు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున పాఠశాలల నిర్మాణం చేపట్టామని, 80 శాతం వరకు పాఠశాలలు పూర్తయ్యాయని, వారం రోజుల్లో అన్ని పాఠశాలలు పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశామని, తెలంగాణ రాష్ట్రంలో విద్యను బలోపేతం చేయడానికి స్కూల్స్ తో పాటు కాలేజీల నిర్మాణం కూడా చేపట్టామని అన్నారు. ఎటువంటి అవతవకలు జరగకుండా ధరణి దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియ ముఖ్యంగా గిరిజన గ్రామాలలోని రైతులకు ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయాలని ధరణి ఆన్లైన్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తన దృష్టికి వస్తే తప్పనిసరిగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల 45 వేల పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తులు ఎలక్షన్ కోడ్ రాకముందే లక్ష వరకు క్లియర్ చేశామని, ఆ తర్వాత మిగిలిన దరఖాస్తులు కొత్తగా రైతులు సమర్పించిన దరఖాస్తులు కలుపుకొని రెండు లక్షల 55 వేలు పెండింగ్ లో ఉన్న వాటిని ధరణి లోపాలు సరిదిద్ది యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో పరిష్కరిస్తామని, దీనికోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామని అన్నారు.

# భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- తెలంగాణ జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్
- ఘనంగా తెలంగాణ ఉద్యన విశ్వవిద్యాలయం 3వ స్నాతకోత్సవం



**విశ్వంభర, సిద్దిపేట ప్రతినిధి :** భారత ఆర్థిక పురోభివృద్ధిలో యువతదే కీలకపాత్ర అని తెలంగాణ జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవాన్ని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ...వికసిత్ భారత్ తో 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయన్నారు. భారత స్థూల జాతీయోత్పత్తికి 18 శాతం పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ వ్యవసాయానికి మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో 70 శాతం పైగా గ్రామీణులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని పేర్కొన్నారు. విద్యార్థులు విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక తిరిగొద్దని గవర్నర్ పిలుపునిచ్చారు. చరిత్రలో అబ్రహాం లింకన్, నరేంద్ర మోడీ తనదైన ముద్ర వేశారన్నారు. పేదరికం ఆకలి బాధతో కొట్టుమిట్టాడుతున్న జనాలకు వాటి నుంచి విముక్తి కల్పించిన గొప్ప వ్యక్తి భారత ప్రధాని నరేంద్ర మోడీ అని కొనియాడారు. విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు రాజ్ భవన్ ఎప్పుడు సిద్ధంగానే ఉంటుందన్నారు.

# పెండింగ్ అభివృద్ధి పనులు చేపట్టాలి


### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**విశ్వంభర, వనపర్తి :** వనపర్తి నియోజకవర్గం లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు. సోమవారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి,బీ.ఆర్.ఎస్ ప్రజాప్రతినిదులతో కలిసి వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ను కలిశారు. వనపర్తి నియోజకవర్గంలో వివిధ మండలాలలో, జిల్లా కేంద్రములో గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చేపట్టిన అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు. అందులో జే.ఎన్.టీ.యూ ఇంజనీరింగ్ కాలేజీ కోసం 5కోట్లు, మొదటి విడత,రెండో విడత 32 కోట్లు,జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్ పనులు, అగ్రికల్చర్ కాలేజీ ఒక కోటి 50 లక్షలు, వనపర్తి నుంచి పెబ్బేరు రోడ్డు 9 కి.మీ.పాలిటెక్నిక్ కళాశాల,నూతన హాస్టల్స్, ప్యాలెస్ ఆధునీకరణ పనులు, తదితర పనులు ఉన్నాయని వివరించారు. చిట్యాల, పీర్లగుట్ట డబల్ బెడ్ రూమ్స్ దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సావధానంగా విన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కలెక్టర్ గతములో ప్రారంభం అయిన పనుల పట్ల పూర్తి అవగాహన ఉన్నందున పెండింగ్ పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి.శ్రీధర్, జెడ్పీటీసీ సభ్యులు పద్మ వెంకటేష్,రఘుపత్తిరెడ్డి, ఎంపీపీలు శ్రీధర్ రెడ్డి,సేనాపతి,మున్సిపల్ చైర్మన్ ఎద్దుల.కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రేస్వామి,మాజీ మార్కెట్ చైర్మన్లు పి.రమేష్ గౌడ్, లక్ష్మారెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల, అశోక్ పాల్గొన్నారు.

# డిజిటల్ సేవలు అందించేందుకే రైతు నేస్తం

### జిల్లా కలెక్టర్ రాజార్షి షా




**విశ్వంభర, ఆదిలాబాద్:** పెరుగుతున్న ఆధునికతను దృష్టిలో ఉంచుకొని అన్నదాతలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందుకే రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా అన్నారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం రైతు వేదిక లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ లో రైతు నేస్తం ద్వారా అన్నదాతలకు వీడియో కాన్ఫరెన్స్,డిజిటల్ సేవలు అందించేందుకు వీలుగా రైతునేస్తం కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యల పై రైతులతో చర్చలు జరుపుకొని పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామాల నుండే రైతులు ఆన్ లైన్ లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవడం , తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవడం వల్ల తెలియని విషయాలు తెలుసుకోవచ్చని తెలియ జేశారు.ఇది ప్రతి మంగళవారం రైతువేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని ప్రతీ రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించాలని,ఈ కార్యక్రమానికి ఎక్కువగా మహిళా రైతులు హాజరయ్యేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పుల్లయ్య,డి సి ఓ మోహన్,డి ఏ వొ స్, ఏ ఈ వోస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఇచ్చోడ మండలం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి. ఎరువులు, విత్తనాల గిడ్డంగిని ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిస్టర్ , బిల్ రశీదులను , నిల్వ ఉన్న ఎరువుల బ్యాగులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజూ బిల్ రిపోర్టు లో తేది, సమయం, రైతుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వే మొబైల్ ఆప్ ను పరిశీలించి,సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



## పాఠశాలల అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేయాలి

### వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య

**విశ్వంభర, నర్సంపేట:** అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం నర్సంపేట మండలంలోని రామవరం ఎంపీపీ ఎస్, నర్సంపేట ఎంపీపీఎస్, నర్సంపేట ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా రూ. 24 కోట్ల వ్యయంతో సుమారు 556 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టినట్లు తెలిపారు. అందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని పనులు తుది దశలో ఉన్నాయన్నారు. వాటిని పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్కులు అందజేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలచే కుట్టిన ఏకరూప దుస్తులను పాఠశాల ప్రారంభం రోజున విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి సెక్టోవల్ ఆఫీసర్ సుధీర్ ఎంపీడీవో శ్రీనివాస్ ఎంపీ ఓ, ఆదర్శ కమిటీ తదితరులు పాల్గొన్నారు.



## మూడు దొంగతనాలకు పాల్పడిన దొంగ అరెస్ట్

### రిమాండ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు

**విశ్వంభర, మద్నూర్:** మండల కేంద్రంనికి చెందిన దరస్వర్ కిరణ్ కుమార్ అనే వ్యక్తి మూడు దొంగతనాలు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మొదటగా పది రోజుల క్రితం మండల కేంద్రంలోని వైన్స్ షాప్ లో పై నుండి దిగి కౌంటర్ లో రూ.23,200 రూపాయిలు దొంగతనం చేశాడు. దాని తరువాత రెండు రోజులకు మేనూర్ శివారులో గల అయ్యప్ప స్వామి ఆలయం తాళం పగలగొట్టి నాలుగు విగ్రహాలను ఎత్తుకొని పోయి దెగ్లూర్ లో గల ఒక వ్యక్తికి అమ్మాడు. అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. దాని తరువాత మొఘ గ్రామంలో పుల్లవార్ లక్ష్మణ్ అనే వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి బీరువా లో గల రూ. 1200 ఎత్తుకెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున దెగ్లూర్ నుండి పెద్ద షేక్కార్గ గ్రామం వైపు పోలీస్ వెహికిల్ పెట్రోలింగ్ చేస్తుండగా కిరణ్ కుమార్ భయంతో పరుగులు తీశాడు. వెంటనే పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా నేరాలు చేసినట్టు ఒప్పుకున్నాడు. అతడి నుండి రూ.1200, ఒక చరవాణి సీజ్ చేసి అతన్ని రిమాండ్ చేయడం జరిగింది. దెగ్లూర్ కి చెందిన ఒక వ్యక్తి పరారి లో ఉన్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



## ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- గ్రేటర్ వరంగల్‌లోని లోతట్టు ప్రాంతాల సందర్శన

**విశ్వంభర, వరంగల్ టౌన్ :** వరద ముంపు నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఇంజనీరింగ్ సానిటేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామకృష్ణ కాలనీ, ఎస్ బి హెచ్ బ్యాంక్ కాలనీ, ప్రగతి నగర్ కుడా కాలనీ, సమ్మయ్య నగర్, నయీం నగర్, బొక్కల గడ్డ, హన్మకొండ బస్ స్టాండ్ రోడ్ ప్రాంతాలతో పాటు వరంగల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన రామన్నపేట, 12 మోరీల ఏరియా ఎన్టీఆర్ నగర్, సంతోష్ మాతా కాలనీ, ఖమ్మం బై పాస్ రైల్వే బ్రిడ్జి, బిఆర్ నగర్, నాని గార్డెన్, కడిపి కొండ రోడ్, డికే నగర్, గరీబ్ నగర్,మేసయ్య నగర్, గాంధీ నగర్ ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన చర్యలపై కమిషనర్ అధికారులకు తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... భారీ వర్షాలు కురిసే క్రమంలో ఇంజనీరింగ్ శానిటేషన్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ సమష్టిగా పని చేసి నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలని ప్రధానంగా బల్దియా పరిధిలోని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీరు నిల్వ ఉంటే అవసరం మేరకు కచ్చా కాలువలు తీసి నీరు ఆగకుండా చూడాలని డ్రైన్ లలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికపుడు సిల్ట్ తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ కృష్ణారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ డిప్యూటీ కమిషనర్ లు రవీందర్, కృష్ణారెడ్డి, ఈఈ లు రాజయ్య, శ్రీనివాస్, ఏసి పి శ్రీనివాస రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ లు సాంబయ్య,నరేందర్, డిఈలు, టిపిఓలు, ఏఈలు బిల్డింగ్ ఇన్స్పెక్టర్ లు ఎస్ఐలు పాల్గొన్నారు.



## స్కూల్ యూనిఫామ్‌లను నాణ్యతగా కుట్టాలి

### అడిషనల్ డిఆర్డిఓ సూర్యారావు

విశ్వంభర, ఆమనగల్లు::- మహిళా సాధికారతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన ప్రభుత్వ పాఠశాల యూనిఫామ్ లు నాణ్యతగా కుట్టాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ డిఆర్డిఓ సూర్యారావు తెలిపారు. మంగళవారం ఆయన మాడుగుల మండలంలో పర్యటించి ప్రభుత్వ విద్యార్థుల దుస్తులను కుట్టే యూనిఫామ్ కుట్టు సెంటర్ పనితీరును పరిశీలించారు. మాడుగుల మండలములోని 40 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 2675 విద్యార్థులకు మాడుగుల,ఇర్విన్, అర్కపల్లి, అప్పారెడ్డి పల్లి గ్రామాలలో యూనిఫామ్ కుట్టు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో నేడు పున ప్రారంభం అవుతున్న సందర్భంగా యూనిఫాంలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# దేశాన్ని కుదిపేస్తున్న అజ్మీర్ లైంగిక దాడి కేసు

- అమ్మాయిలను ట్రాప్ చేస్తున్న గ్యాంగ్
- ఫొటోలు మార్ఫింగ్ చేసి డబ్బులు వసూలు
- అనంతరం సామూహిక అత్యాచారాలు
- గతేడాది నుంచి సాగుతున్న తతంగం



**విశ్వంభర, అజ్మీర్ :** అజ్మీర్ లైంగిక దాడి కేసు ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తోంది. సోషల్ మీడియా ద్వారా అమ్మాయిలను ట్రాప్ చేసి.. ఆ తర్వాత వారి ఫొటోలను మార్ఫింగ్ చేయడం.. డబ్బులు డిమాండ్ చేసి అమ్మాయిలను సామూహికంగా లైంగిక దాడి చేయడం.. ఆ తతంగాన్ని వీడియో రికార్డ్ చేసి పదే పదే డబ్బులు వసూలు చేయడం, పలుమార్లు లైంగిక దాడలు చేయడం.. ఇది అజ్మీర్ కథ. ఇప్పుడు ఈ కేసు బయటకు రావడంతో అందులో సంచలనాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ దారుణం చాలా రోజులుగా సాగుతు న్నా వారికి భయపడి అమ్మాయిలు బయటకు చెప్పలేదు. కానీ ఇప్పుడు ఓ యువతి ఫిర్యాదుతో బయటకు వచ్చింది. నిందితులు కోచింగ్ సెంటర్లకు వెళ్లే అమ్మాయిలనే ట్రాప్ చేస్తుంటారు. రీసెంట్ గా ఓ యువతి కోచింగ్ సెంటర్ కు వెళ్లగా అక్కడ ఆమెకు మరో అమ్మాయి పరిచయం అయింది. పరిచయం అయిన యువతి.. ఇర్ఫాన్ అనే పేరుతో ఉన్న ఇన్ స్టాగ్రామ్ ఐడీని ఫ్రెండ్ రిక్వెస్ట్ ద్వారా యాక్సెప్ట్ చేయా లంటూ తెలిపింది. ఆ అమ్మాయి అలాగే చేసింది. యువ తి ఇన్ స్టా నుంచి ఫొటోలు డౌన్ లోడ్ చేసుకున్న సదరు యువకుడు వాటిని మార్ఫింగ్ చేశాడు. ఆమెను డబ్బు లు పంపించాలని.. లేదంటే సోషల్ మీడియాలో పెడుతానంటూ బెదిరించాడు. ఆమె డీల్ కు ఒప్పుకుని రూ.5 లక్షలు ఇవ్వడానికి ఓకే చెప్పింది. తన ఇంట్లోనే డబ్బులను దొంగతనం చేసింది. నిందితుడు చెప్పిన చోటకు డబ్బులతో వెళ్లగా.. సదరు యువకుడు తన ఫ్రెండ్స్ తో కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డా డు. ఈ అఘాయిత్యాన్ని మొత్తం వీడియో తీశారు. ఆ వీడియోను యువతికి పంపించి మరో రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత డబ్బు ఇవ్వలేకపోయిన యువతి.. విషయం తన ఇంట్లో వారికి చెప్పింది. కుటుంబీకులు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విషయం బయటకు వచ్చింది. కేసు నమోదు చేసిన అజ్మీర్ పోలీసులు ఇప్పటి వరకు ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అక్టోబర్ 2023 నుండి ఈ తతంగమంతా కొనసాగుతున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది.

# మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

## ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**విశ్వంభర, కామారెడ్డి:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మంగళ వారం కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో మంచినీటి సరఫరా పై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్, జిల్లా పంచాయతీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...పైప్ లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి అరికడుతూ మంచినీటి సరఫరా చేయాలన్నారు. కామారెడ్డి మునిసిపాలిటీల్లో 18,800 గృహ సముదాయాలకు ప్రతిరోజు 18.23 మిలియన్ లీటర్ల నీరు అవసరం కాగా మిషన్ భగీరథ, పెద్ద చెరువు, బోర్ వెల్స్ ద్వారా 10.59 మిలియన్ లీటర్ల నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నామన్నారు. తరచూ జిపిఆర్ పైప్ లైన్ లీకేజీ వల్ల నీరు సక్రమంగా రావడం లేదని, భవిష్యత్తు పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇందల్వాయి నుండి మల్లన్నగుట్ట వరకు 24.7 కిలోమీటర్ల మేర రూ.195 కోట్ల తో నూతన పైప్ లైన్ నిర్మాణం చేపట్టనున్నామని, టెండర్లు పూర్తయ్యాయని నిధుల మంజూరు కోసం మంత్రితో చర్చించి ఆరు మాసాలలో పనులు పూర్తి చేస్తామన్నారు. అమృత్ 2.0 క్రింద కామారెడ్డి మున్సిపాలిటీలో మంచినీటి సరఫరాకు రూ.93 కోట్లతో రూపొందించిన కార్యక్రమం అగ్రిమెంట్ కావలసి ఉన్నదని, త్వరలో అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం పెద్ద చెరువు తో పాటు టేక్రియాల్ చెరువు నుండి కామారెడ్డి పట్టణానికి మంచినీటి సరఫరాకు విడి విడిగా ప్రతిపాదనలు రూపొందించవలసినదిగా అధికారులకు సూచించారు. పనులు పూర్తి కావడానికి సమయం పడుతున్నందున తాత్కాలికంగా నీటి ఎద్దడి నివారణకు బోర్ వెల్స్ రీఛార్జ్ కు చర్యలు తీసుకోవలసిందిగా మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. కాగా మున్సిపాలిటీలో రూ.21 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని, అందులో ఫిల్టర్ బెడ్ ల ద్వారా మంచినీటి సరఫరాకు రూ.17 కోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని ప్రభుత్వ సలహాదారుకు తెలుపగా సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని, నీటి పన్ను వసూలు పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టిఎఫ్ ఐడీసీ పథకారం క్రింద కామారెడ్డి మునిసిపాలిటిటీ లో రూ.24 కోట్లతో పలు పనులు చేపడుతున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్న నీరు పసుపు రంగులో వస్తున్నదని, వాసన వేస్తున్నదని ఫిర్యాదులు వస్తున్నాయని, నాణ్యత గల నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకాధికారులు గత మే 7 నుండి 15 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లీకేజీలను అరికట్టడంతో పాటు బోర్ వేల్స్, రీ-ఛార్జి, మోటార్ల బిగింపు, నీటి సరఫరా కానీ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా వంటి పనులు చేపట్టారని, ప్రస్తుతం నీటి ఎద్దడి లేదని కలెక్టర్ వివరించారు. రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే కాళేశ్వరం 22వ ప్యాకేజి పనుల ప్రగతిని సమీక్షిస్తూ ప్రస్తుత సంవత్సరంలో చేపట్టు పనులు, పెండింగ్ బిల్లుకు సంబంధించి రూ. 375 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలని ఇరిగేషన్ ఈఈ విద్యావతికి సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ ఈ రాజేంద్ర కుమార్, ఏఈ లు స్వప్న, నరేష్ కుమార్, రమేష్, పబ్లిక్ హెల్త్ ఈ ఈ తిరుపతి కుమార్, డిపిఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై మానవీయ కోణంలో పని చేయాలి


## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**విశ్వంభర, మహబూబ్ నగర్:** ప్రజా సమస్యల పరిష్కారంలో మానవీయ కోణంలో పనిచేయాలని,అప్పుడే వారికి తగిన న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన జిల్లా కలెక్టర్ రవినాయక్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ లతో కలిసి జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 27 నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వలన అభివృద్ధి ఆగిపోయిందని,ఇకపై అధికారులందరూ అభివృద్ధిపై దృష్టి సారించి,పనులు వేగంగా జరపాలని ఆయన సూచించారు. గతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న వారి వద్ద నుంచి తిరిగి భూములను స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చట్టానికి, న్యాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ,ప్రజాస్వామ్య వ్యవస్థ ను కాపాడుతూ ప్రజా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో డిజిటల్ కంటెంట్ బుక్స్ ద్వారా 20 శాతం అధిక ఫలితాలను సాధించారని, విద్యాశాఖ అధికారుల కృషి ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు సైతం మంచి ఫలితాలను సాధించారని,ఈ సందర్భంగా ఆయన అభినందించారు. పాఠ శాల ల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాం, టెక్ట్స్, నోట్ బుక్స్ ఇచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందని, సాంకేతిక, చిన్న చిన్న విషయాలను చూపి అభివృద్ధి పనులను ఆపకండని ఆయన కోరారు.రానున్న రోజుల్లో కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు,వాటిపై అధికారులు పూర్తి స్థాయిలో శ్రద్ధ వహించాలని,ప్రభుత్వం నుండి వచ్చే ప్రతి పథకం వంద శాతం అమలు దిశగా పని చేయాలని ఆయన పేర్కొన్నారు.

# కోర్టులో ఆస్తి కేసు.. మూడు రోజులుగా మార్చురీలోనే భర్త శవం

- కేసు వాపస్ తీసుకుంటేనే అంత్యక్రియలు చేస్తా
- భీష్మించుకు కూర్చున్న భార్య
- చెల్లెళ్లు, సోదరుడి వల్లే ఆత్మహత్య అంటూ ఆరోపణ



**విశ్వంభర, చౌటుప్పల్ :** ఈ రోజుల్లో ఆస్తులకు ఇచ్చే విలువ కూడా బంధాలకు ఇవ్వట్లేదు. ఆస్తికోసం తోడ బుట్టిన సోదరుడిపైనే కేసులు వేస్తున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం. ఇప్పుడు అంతకన్నా దారుణమైన ఘటన చోటు చేసుకుంది. తండ్రి ఆస్తి కోసం కోర్టులో చెల్లెళ్ళు, సోదరుడు కేసు వేస్తేనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని.. కేసు విత్ డ్రా చేసుకుంటనే అంత్యక్రియలు నిర్వహిస్తానని ఓ భార్య భీష్మించుకుని కూర్చుంది. దాంతో మూడు రోజులుగా ఆమె భర్త శవం మార్చురీలోనే ఉంది. ఈ దారణమైన ఘటన యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో చోటుచేసుకుది. గ్రామస్తుడు చీరిక హనుమంత రెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ... అక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నాడు. హనుమంతరెడ్డి తండ్రి నర్సిరెడ్డికి 7.24 ఎకరాల భూమి ఉంది. అయితే తండ్రి ఆస్తిలో తన తమ్ముడితో హనుమంతరెడ్డికి తగాదాలు ఉన్నాయి. దాంతో తన తమ్ముడు, చెల్లెళ్లు కలిసి ఆస్తి కోసం కోర్టులో కేసు వేశారు. ఆ కేసు విషయంలో తరచూ గొడవలు జురుగుతండటంతో మనస్థాపానికి గురైన హనుమంతరెడ్డి పంతంగిలోని ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో తన భర్త మరణానికి సోదరుడు, చెల్లెళ్లే కారణం అని.. కోర్టులో కేసు ఉపసంహరించుకుంటేనే అంత్యక్రియలు చేస్తానంటూ ఆమె భీష్మించుకుని కూర్చుంది. మూడు రోజులుగా పెద్ద మనుషులు నచ్చజెప్పినా వినట్లేదు. ఇక చివరకు బంధువుల ఒత్తిడితో మంగళవారం కేసును ఉపసంహరించుకున్నారు. దాంతో ఇప్పుడు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన చంద్రబాబు



**విశ్వంభర, విజయవాడ:** తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం రాజ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. టీడీపీ అధినేత... రేపు ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఏర్పాటు, మంత్రుల కూర్పునకు సంబంధించి గవర్నర్‌కు చంద్రబాబు వివరించారు. ఉదయం ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేలు సమావేశమై... శాసనసభా పక్ష నేతగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యేల మద్దతుతో కూడిన లేఖను కూటమి నేతలు గవర్నర్‌కు అందించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్... చంద్రబాబును ఆహ్వానించారు.




## 13 మంది ఇన్స్పెక్టర్ల బదిలీ..

### ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ

**విశ్వంభర,ఖమ్మం సిటీ:** మల్టీ జోన్ వన్ పరిధిలో పని చేస్తున్న 13 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజిపి ఏవి. రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్ని శాఖల్లో పెద్ద ఎత్తున బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది. దీంతో పోలీస్ శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. మల్టీజోన్ వన్ పరిధిలో పనిచేస్తున్న 13 మంది ఇన్స్పెక్టర్లను బదిలీ చేశారు.ఖమ్మం జిల్లాలో ముగ్గురు ఇన్స్పెక్టర్లు బదిలీ అయ్యారు. నిజామాబాద్ విఆర్ లో పనిచేస్తున్న భక్తుల సత్యనారాయణ కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు బదిలీలో రానున్నారు. జిల్లా ట్రైనింగ్ సెంటర్లో విధులు నిర్వహిస్తున్న పి వెంకన్నను వరంగల్ వేకెన్సీ లో బదిలీ చేశారు. అదేవిధంగా క్రైమ్ స్పెషల్ బ్రాంచ్లో పనిచేసిన కే సతీష్ పాల్వంచ బదిలీపై వెళ్లనున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నాయి.



## తెలంగాణ ఎడ్ సెట్ ఫలితాలు విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఎడ్ సెట్ ఫలితాలు విడదల అయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటలకు విడుదల చేశారు. వీటిని హైదరాబాద్ లోని హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫీస్ లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎంజీ వర్సిటీ ఇంఛార్జి విసి నవీన్ మిట్టల్ కలిసి విడుదల చేశారు. రాష్ట్రంలో రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం టీజీ ఎడ్సెట్ ఎగ్జామ్ ను నిర్వహించారు. మే 23న నిర్వహించిన ఎగ్జామ్ కు మొత్తం 33,879 మంది అప్లై చేసుకున్నారు. అయితే ఇందులో 29, 463 మంది మాత్రమే ఎగ్జామ్ రాశారు. ఈసారి ఎడ్సెట్ పరీక్షలను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహించింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఈడీ కాలేజీల్లో మొత్తం 14, 285 బీఈడీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 96.90 శాతం మంది తాజా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు.

## 470కి 466 మార్కులు.. అంతలోనే అకాల మరణం..

**విశ్వంభర,మంథని:** సరస్వతీ పుత్రుడు అకాల మరణం చెందాడు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 470కి గాను 466 మార్కులు సాధించాడు. దాంతో తల్లి దండ్రులు ఉప్పొంగిపోయారు. కొడుకును చూసి మురిసిపోయిన ఆ తల్లిదండ్రులకు సంతోషం ఎక్కువ కాలం ఉండలేదు. అంతలోనే కొడుకు అందరాని లోకాలకు వెళ్లిపోవడంతో కడుపు కోత మిగిలింది. ఈ విషాద ఘటన పెద్దపల్లి జిల్లా మంథనిలో జరిగింది. పట్టణానికి చెందిన శ్రీ వత్సవ్ మొన్నటి ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 170కి గాను 166 మార్కులు సాధించాడు. కొడుకును చూసి తల్లిదండ్రులు ఆనందించే లోపే.. అతనికి బ్రెయిన్ ఇన్ఫెక్షన్ సోకింది. దాంతో వెంటనే ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కానీ చికిత్స పొందుతూ బ్రెయిన్, కిడ్నీ పనిచేయకపోవడంతో పరిస్థితి విషమించి చనిపోయాడు. దాంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.



## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి షాక్!

- నోటీసులు జారీ చేసిన హైకోర్టు
- ఈ నెల 20న హాజరు కావాలని ఆదేశం
- మరో 25 మందికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం
- ఆత్మహత్య చేసుకుంటానన్న వ్యాఖ్యలకు నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్:** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి షాక్ తగిలింది. ఆయనకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే ఎన్నికల ప్రచారంలో ఓటేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హైకోర్టు సీరియస్ అయ్యింది. దీంతో ఈనెల 20న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు వేయాలని బీజేపీ నేత ఈటల రాజేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈటల పిటిషన్ పై విచారణ చేపట్టిన హైకోర్టు.. హుజూరాబాద్ నియోజకవర్గంలో పోటీ చేసిన 24 మందికి నోటీసులు జారీ చేసింది. కౌశిక్ రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారా..? లేదా..? అని ఈనెల 20న హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ఆదేశించింది. వారిచ్చిన వాంగ్మూలం ఆధారంగా తదుపరి చర్యలు హైకోర్టు తీసుకోనుంది.



## హీరో దర్శన్ ప్రియురాలు అరెస్ట్..!

**విశ్వంభర, బెంగళూరు :** కన్నడ ఇండస్ట్రీలో హీరో దర్శన్ కేసు ఇప్పుడు కుదిపేస్తోంది. రేణుకాస్వామి హత్య కేసులో ఇప్పటికే దర్శన్ ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం ఉదయం ఆయన్ను అరెస్ట్ చేసిన పోలీసులు.. సాయంత్రం ఆయన ప్రియురాలు హీరోయిన్ పవిత్ర గౌడను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేణుకా స్వామి చిత్ర దుర్గలోని అపోలో బ్రాంచిలో పని చేస్తున్నాడు. అయితే ఆయన కొంత కాలంగా పవిత్ర గౌడకు అసభ్యకరంగా మెసేజ్ లు పెడుతున్నాడని ఆమె తన ప్రియుడకు చెప్పింది. దాంతో దర్శన్ తన స్నేహితులుతో కలిసి రేణుకాస్వామిని కిడ్నాప్ చేయించి ఆ తర్వాత హత్య చేశాడు. హత్య తర్వాత రేణుకాస్వామి డెడ్ బాడీని బెంగుళూరులోని కామాక్షి పాళ్యం వద్ద కాల్వలో పడేశాడు. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. కాగా రేణుకాస్వామిని దర్శన్ హత్య చేయించాడని పోలీసుల విచారణలో తేలగా.. వారు మంగళవారం ఉదయం దర్శన్ ను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

## సరదా కోసం బాలుడి తుంటరి పని

- విమానంలో బాంబ్ ఉందని బెదిరింపులు
- అధికారుల ఉరుకులు, పరుగులు




**విశ్వంభర, మీరట్:** ఓ బాలుడు సరదా కోసం చేసిన పని చివరకు అతని అరెస్ట్ కు దారి తీసింది. ఉత్తర ప్రదేశ్ లోని మీరట్ కు చెందిన బాలుడు ఈ పని చేశాడు. ఢిల్లీ నుంచి టొరంటో వెళ్తున్న ఎయిర్ కెనడా విమానంలో బాంబ్ ఉందని ఫేక్ మెయిల్ పంపాడు. దాంతో అధికారులు ఉరుకులు, పరుగులతో నానా హైరానా పడ్డారు. దాంతో విమానం దాదాపు 12 గంటలకు పైగా ఆలస్యం అయింది. ఎలాంటి బాంబ్ లేదని పోలీసులు నిర్ధారించుకున్న తర్వాత అసలు ఆ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో కనిపెట్టారు. మీరట్ నుంచి ఓ 13 ఏళ్ల బాలుడు ఈ పని చేసినట్టు గుర్తించారు. టీవీల్లో నకిలీ బాంబ్ కాల్స్ సీన్లు చూసిన అతను.. తాను కూడా అలా చేయాలని అనుకున్నాడు. ఇందుకోసం ఓ ఫేక్ మెయిల్ ఐడీని క్రియేట్ చేసుకున్నాడు. తన ఫోన్ నుంచి ఈ మెసేజ్ పెట్టాడు. అది గుర్తించిన పోలీసులు.. ఢిల్లీ నుంచే అతనితో మాట్లాడారు. అయితే తర్వాత రోజున బాలుడుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనికి ప్రస్తుతం కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కేవలం సరదా కోసమే చేశానని.. తనను పోలీసులు కనుక్కుంటారో లేదో చూడటం కోసం ఇలా చేశానని సదరు బాలుడు తెలిపారు.



## చికెన్ మసాల కోసం బయటకు వెళ్తే.. కిడ్నాప్ చేసి హోం గార్డుకు పెళ్లి..!

**విశ్వంభర, బిహార్ :** ఈ నడుమ వింతలకే వింతగా ఉండే పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. తాజాగా అలాంటిదే ఒకటి జరిగింది. ఎక్కడైనా సరే అమ్మాయిలను ఎత్తుకెళ్లి బలవంతంగా పెళ్లి చేసిన ఘటనలను చూశాం. కానీ ఇప్పుడు ఏకంగా అబ్బాయినే ఎత్తుకెళ్లి బలవంతంగా పెళ్లి చేసేశారు. ఈ వింత ఘటన బిహార్ లో జరిగింది. నవ్‌గాచియా పోలీస్ స్టేషన్ పరిధిలోని సకుచాలో సుమిత్ కుమార్ ఉంటున్నాడు. ఆయన హోంగార్డుగా శిక్షణ పూర్తి చేసుకున్నాడు. అయితే మంగళవారం నాడు తన మేనమామ ఇంటికి వెళ్లి కోళ్లను తీసుకున్నాడు. చికెన్ మసాలా కోసం షాపుకు వెళ్లగా.. కొందరు దుండగులు వచ్చి తుపాకీని చూపించి బెదిరించి కారులో ఎక్కించుకుని వెళ్లారు. కిడ్నాపర్లలో గోపాల్ యాదవ్ అనే వ్యక్తి కూడా ఉన్నాడు. వంద కిలో మీటర్లు తీసుకెళ్లి గోపాల్ యాదవ్ కుమార్తెతో బలంవంతంగా కొట్టి మరీ పెళ్లి చేశారు. ఆ తర్వాత సుమిత్ ను మార్గమధ్యమంలో వదిలేశారు. సుమిత్ కుటుంబీకులకు ఈ విషయం చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధోబినియాకు చెందిన గోపాల్ యాదవ్, రోహిత్ యాదవ్, భిలి కుమార్, అశ్వని కుమార్‌లను పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితులందరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



## అధిక వడ్డీ ఆశ చూపి రూ.150 కోట్లు కొట్టేసిన ఫైనాన్స్ కంపెనీ

**విశ్వంభర, నాగర్ కర్నూల్:** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు భూ నిర్వాసితుల నుంచి అధిక వడ్డీ ఆశ చూపి ఓ ఫైనాన్స్ కంపెనీ కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దాదాపు 20 గ్రామాల ప్రజలు మోసపోయారు. రెండు సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరిగిన న్యాయం జరగలేదంటూ బాధితులు వాపోతున్నారు. అటు భూములను కోల్పోయి ఇటు డబ్బులను పోగొట్టుకుని తమ పిల్లల భవిష్యత్తు రోడ్డుపాలయిందని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో దాదాపు 20 గ్రామాల ప్రజలకు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఇళ్లు కోల్పోవడంతో ప్రభుత్వం పరిహారంగా కొంత నగదును ఇచ్చింది. ఓ ఫైనాన్స్ కంపెనీ అధిక వడ్డీ ఆశ చూపి 2500 కుటుంబాల నుంచి మొత్తం రూ.150 కోట్లను వసూలు చేసింది. అనంతరం 2021లో ఆ సంస్థను మూసివేశారు. దీంతో ఆ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు 2021లో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికి ఆ కేసు సమస్య పరిష్కారం కాలేదు. తమకు జరిగిన అన్యాయాన్ని ఇవాళ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యకి తెలిపారు. ఫైనాన్స్ కంపెనీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోగా ఫిర్యాదు చేసిన వారిని బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆవేదనను అర్థం చేసుకొని తమకు న్యాయం చేయాలంటూ కృష్ణయ్య హైదరాబాద్‌లోని బీసీ భవన్ నుంచి విద్యానగర్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. బాధితుల్లో చాలా వరకు మొత్తం భూములు, ఆస్తులు కోల్పోయి వచ్చిన పరిహారాన్ని కూడా కొంత మంది దళారులు మోసం చేస్తుంటే వారికి పోలీసులు, రాజకీయ నాయకులు అండగా నిలబడి మొత్తం దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పేద ప్రజల పొట్ట కొట్టే ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# కమిట్‌మెంట్‌తో పని చేసి ప్రజల మన్ననలను పొందాలి

○ ట్రైనీ ఐఏఎస్ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనలు



విశ్వంభర, హైదరాబాద్ : కమిట్మెంట్‌తో పనిచేసి ప్రజల మన్నలను పొందాలని, శిక్షణలో ఉన్న 2023 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు హిత బోధ చేశారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను మర్యాద పూర్వకంగా 2023 బ్యాచ్ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారులు కలిశారు. డైరెక్టర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శశాంక్ గోయల్ ఐఏఎస్, ట్రైనీ ఐఏఎస్ అధికారులను డిప్యూటీ సీఎంకు పరిచయం చేశారు. శిక్షణలో ఉన్న అధికారులకు కేటాయించిన జిల్లాలు, గత ఎన్నికల్లో వారు నిర్వహించిన విధుల గురించి డిప్యూటీ సీఎంకు ఆయన వివరించారు. భగవంతుడు ప్రజలకు చేసేందుకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవాలని డిప్యూటీ సీఎం వారితో సూచించారు. శిక్షణలో ఉన్న సమయంలో క్షేత్రస్థాయిలో లోతుగా అధ్యయనం చేయడం వల్ల ప్రజల సమస్యలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం తెలుసుకున్న అంశాలను పరిగణలోకి తీసుకొని పరిపాలనలో తీసుకునే నిర్ణయాల వల్ల ప్రజా సమస్యలు పరిష్కరించడం సులువు అవుతుందన్నారు. భౌగోళికంగా, వాతావరణం విషయంలో తెలంగాణ రాష్ట్రం చాలా బాగుంటుంది అని, ప్రజల సహకారం కూడా మంచిగా లభిస్తుందన్నారు. శిక్షణ కాలంలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు నిర్వహించిన విధులు, వారు చేసిన అధ్యయనం గురించి డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం సెక్రటరీ కృష్ణ భాస్కర్ ఐఏఎస్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పెద్ద బోయిన తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్ పదవి దరఖాస్తులకు ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్ :** 2019లో సవరించబడిన ఆర్‌టీఐ చట్టం, 2005లోని సెక్షన్ 15 మరియు 16 ప్రకారం అర్హత మరియు ఆసక్తిగల అభ్యర్థులు తెలంగాణ సమాచార కమిషన్‌లోని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, రాష్ట్ర సమాచార కమిషనర్ పదవికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని అవసరమైన ధృవీకరణ పత్రాలను రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ 500022. పంపాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 29 తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫాం వెబ్‌సైట్ : https://telangana.gov.in లేదా http://tsic.gov.in లో అందుబాటులో ఉన్నట్లు సూచించారు. గత సంవత్సరం జులై 4న దరఖాస్తు చేసుకున్న వారందరూ మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాలు



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లిలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాలు జాతర మంగళవారం డప్పు చప్పుళ్ల మధ్య పోతరాజుల విన్యాసాలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తె అమావాస్య తరువాత వచ్చే మొదటి మంగళవారం మెట్పల్లి ప్రాంత గౌడ కులస్తులు ఇంటికి ఒక బోనం చొప్పున పాతబస్తీ భూమాత ఆలయం వద్ద నుంచి మార్కెట్ ఏరియా పాత బస్టాండ్ మీదుగా వట్టి వాగు సమీపంలోని రేణుక మాత దేవాలయం వరకు వైభవంగా మంగళ హారతులతో వందలాది బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం అయినా రేణుక మాత బోనాల జాతరలో కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు సరోజనమ్మ బోనం ఎత్తి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేణుకా మాతకు వారు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముంజ సత్యనారాయణ గౌడ్, చెట్ల పెల్లి సుఖేందర్ గౌడ్, చర్లపల్లి రాజేశ్వర్ గౌడ్, మెట్పల్లి గౌడ సంఘం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మండల కాంప్లెక్స్ భవనాన్ని వెంటనే నిర్మించాలి





**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలో ఎన్నికల కోడ్ ముగియడంతో రహదారి విస్తరణ పనులు ఊపందుకున్నాయి. రాజీవ్ గాంధీ చౌరస్తా నుంచి బీసీ హాస్టల్ వరకు రోడ్డు విస్తరణ పనులు కాంట్రాక్టర్ చేపట్టారు దాంతో రోడ్డుకు ఇరువైపులా చిన్నచిన్న డబ్బులు, తోపుడు బళ్ళు, ఫుట్ పాత్‌పై వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని చిరు వ్యాపారస్తులు కోరుతున్నారు. తాము కోల్పోయిన స్థలంలో మండల కాంప్లెక్స్ భవనానికి అనుమతులు వచ్చినా గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఇంతవరకూ నిర్మాణానికి నోచుకోలేదని ఆవేదన చెందుతుంది. గతంలో అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని తమను రోడ్డున పడేసి నాయకులు చోద్యం చూస్తున్నారని అని వారు మండిపడుతున్నారు. కనీసం కొత్తగా వచ్చిన ఈ ప్రభుత్వమైనా తమని పట్టించుకొని బాలుర ఉన్నత పాఠశాల మరియు మండల ప్రజా పరిషత్ కాంప్లెక్స్ భవనాలను నిర్మించి తమకు కేటాయించి ఆదుకోవాలని చిరు వ్యాపారస్తులు కోరుతున్నారు.

## ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ఫలితాలు రావాలి

### - ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

విశ్వంభర, దేవరకొండ : కస్తూర్బా, మోడల్ స్కూల్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాల మరియు కళాశాలలో విద్యుత్, టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కొరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వెలాదిగా మూతపడిన ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పూర్వ వైభవం తీసుకురావడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతీ బాలికల పాఠశాల, కళాశాలల వద్ద ఇవ్ టీజింగ్, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు అదేశించి, ఆ పరిసర ప్రాంతాల్లో తన సొంత నిధుల నుంచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



## రవాణా శాఖ అధికారులతో మంత్రి పొన్నం సమీక్ష

### 100 శాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులకు మంత్రి అభినందనలు



**విశ్వంభర, హైదరాబాద్ :** రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవాణా శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, ఆర్టీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా చట్టానికి లోబడి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రెవెన్యూ పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు. త్రైమాసిక టాక్స్ వసూలుకు సంబంధించి తక్కువగా నమోదు చేసిన వివిధ జిల్లాల అధికారులకు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. 100 శాతం పన్ను వసూలు చేసిన జిల్లా అధికారులను అభినందించారు. సమావేశానికి రాని అధికారులపై నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ మంత్రిగా మొదటి సారి డీటీసీలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అధికారులు రవాణా శాఖ గౌరవాన్ని పెంపొందించాలని, రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి సూచించారు. ఆదాయ అన్వేషణలో విచక్షణ రహితంగా వేధింపుల వల్ల కాకుండా చట్ట ప్రకారమే వ్యవహరించాలని సూచించారు. అధికారులు ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.
అన్ని స్కూల్‌లు, కాలేజీల్లో బస్సులను తనిఖీ చేయాలని డ్రైవర్లకు, స్కూల్ బస్సులకు కచ్చితంగా ఫిట్నెస్ ఉంటేనే రోడ్డు ఎక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రత పై రవాణా శాఖ అధికారులు జిల్లాలో కలెక్టర్ ప్రాభవిక వ్యక్తులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి రోడ్డు భద్రతపై కనీస అవగాహన ఉండేలా చూసుకోవాలన్నారు. స్కూల్ బస్సు కి సంబంధించి డ్రైవర్, క్లీనర్, బస్సు సమయాలు తెలిపే విధంగా ప్రతి పాఠశాల యాజమాన్యం స్కూల్ బస్ యాప్‌లో అప్డేట్ చేస్తే పూర్తి సమాచారం తల్లిదండ్రులకు తెలిసేలా ప్రమాదాలు నివారించేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకొచ్చారు. దాంతో పాటు గతంలో కారు డోర్ లకు బ్లాక్ ఫిలిం గ్లాస్ ఉన్న వాటిపై విధిగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దుల వద్ద ఉన్న చెక్ పోస్టులను ఎన్ ఫోర్స్ మెంట్‌ను మరింత బలపరిస్తే అవినీతికి ఆస్కారం లేకుండా ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. హైదరాబాదు ఆటో రిక్షాలపై ప్రస్తుతం ఉన్న పాలసీతో పాటు సీఎన్జీ, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేలా రూపొందించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ విషయంలో అవినీతికి ఆస్కారం లేకుండా డిసెంట్రలైజ్ ఎలా ఉంటుందనే దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని ఏదైనా బిన్న ఆలోచన వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో స్పెషల్ సెక్రటరీ విజయేంద్ర బోయి, రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు ప్రవీణ్, రమేష్, మమత పాల్గొన్నారు.



ఢిల్లీలో పెట్రోలియం శాఖ మినిస్టర్ హర్ దీప్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అంజి రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజి రెడ్డి, రాష్ట్ర నాయకులు మురళీధర్ గౌడ్, రాష్ట్ర నాయకులు రాజేశ్వరరావు, దేశ్ పాండే, రవి గౌడ్ తదితరులు.

- విశ్వంభర, డిల్లీ

## పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కావద్దు

### అంగన్వాడి కేంద్రాన్ని ప్రారంభించిన కస్తూరి శ్రీ చరణ్




**విశ్వంభర, నారాయణపూర్ :** నారాయణపురం మండలంలోని లచ్చమ్మ గూడంలో కస్తూరి ఫౌండేషన్ సహకారంతో 4.80 లక్షల వ్యయంతో నూతనంగా అంగన్వాడీ భవనం నిర్మించారు. ఈ భవనాన్ని కస్తూరి శ్రీ చరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు కలిసి కృతజ్ఞలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కస్తూరి శ్రీ చరణ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2017లో కస్తూరి ఫౌండేషన్ ప్రారంభించి విద్యారంగాన్ని సేవా రంగంగా ఎంచుకొని 7 సంవత్సరాల నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కావొద్దనే ఉద్దేశ్యంతోనే మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మన ఊరి బడులను మనమే బాగుపర్చుకోవాలని, తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు నిర్మాణం ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో మా ఫౌండేషన్ బాలికల విద్యపై, అంగన్ వాడీ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టమాన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాలను పట్టించుకోని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. చిన్నపిల్లలకు మంచి పౌష్టికాహారం అందాలని అంగన్వాడీ కేంద్రాలకు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కస్తూరి శ్రీ చరణ్ చేతుల మీదగా అంగన్ వాడి పిల్లలకు ఆట వస్తువులు, గ్యాస్ స్టవ్, పప్పు కుక్కరు, బాలింతలు అంగన్ వాడీ కేంద్రానికి వచ్చినపుడు వాళ్లకు ఇబ్బందులు కలగకుండా చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జే అలివేలు, అంగన్వాడీ సూపర్ వైజర్ శ్రీలత, అంగన్వాడీ అలుగువెల్లి నిరూప, ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు సాగర్ల లింగయ్య, జే జగన్, జక్కలి రాజు, ముత్తయ్య, జక్కలి విక్రం, కస్తూరి ఫౌండేషన్ సభ్యులు బోనగిరి దేవేందర్, మహేష్, నవీన్ రెడ్డి, రామకృష్ణ, నరేందర్ రెడ్డి, జహంగీర్, వీరమళ్ల కార్తీక్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మొరిపిరాల గ్రామానికి చెందిన ముప్పిడి మధు గత నెల మరణించారు. మధుది నిరుపేద కుటుంబం, గ్రామంలోని ప్రజలు మరియు యువకులు తమ వంతు సహాయంగా 42,000 రూపాయలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పంజలా స్వామిగౌడ్, యూత్ అధ్యక్షుడు ముద్దసాని శ్రీనివాస్ గౌడ్, యూత్ సభ్యులు బొంగు అంజయ్య గౌడ్, ఇంద్రపల్లి మహేశ్, ముప్పిడి స్వామి, ముప్పిడి మహేశ్, ముప్పిడి రాజుకుమార్, గంగారాం, సాయి, అఖిల్, అనీల్ వర్ధన్ పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి ప్రభుత్వం కృషి ఎమ్మెల్యే బాలునాయక్



**విశ్వంభర, చింతపల్లి :** దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. చింతపల్లి మండలంలోని గుడితండా గ్రామంలో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేశ్, మల్లారెడ్డిపల్లి ఎంపీటీసీ చందు నాయక్, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య గౌడ్, హేము నాయక్, నియోజక వర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అవిశ్వాస తీర్మానం అక్రమం

### సింగిల్ విండో చైర్మన్ కంచర్ల అశోక్ రెడ్డి




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలోని సింగిల్ విండో బ్యాంక్‌లో మంగళవారం సింగిల్ విండో చైర్మన్ కంచర్ల అశోక్ రెడ్డి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానం ఆరాచకమైనది, అక్రమమైనదన్నారు. సహకార సంఘం చట్ట ప్రకారం మూడు సార్లు బ్యాంక్ సమావేశానికి హాజరుకానీ డైరెక్టర్లను తొలగించే అధికారం చైర్మన్, సహకార సంఘనికి ఉంటుందన్నారు. అందులో భాగంగానే సంఘ డైరెక్టర్లు బయ్యని చంద్రశేఖర్, ఆకుల వెంకటేశ్వర్లు, మూడు సార్లు సమావేశానికి హాజరుకాకపోవడంతో వారిపై అనర్హత వేటు వేసినట్లు పేర్కొన్నారు. అయినా తనపై అవిశ్వాసం తీర్మాన నోటీస్ కాపీలో వారి సంతకాలు చెల్లవు అని జూన్ 18వ తేదీ వరకు స్టే విధించిన ట్రిబ్యునల్ కోర్టు కాపీని డీసీఓకి అందించినప్పటికీ ఇచ్చిన తీర్పు ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా సమావేశం నిర్వహించడం సరికాదన్నారు. మంగళవారం డీసీఓ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా వ్యవహరిస్తూ నేను కూడా కోర్టులో చూసుకుంటానని, వారు బెదిరిస్తూ మాట్లాడడం ఎంతవరకు సరైనదని ప్రశ్నించారు. జూన్ 18వ తేదీ వరకు స్టే ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా.. అధికార దాహంతో చేసిన అవిశ్వాస తీర్మానం చెల్లదని పేర్కొన్నారు.

## తిమ్మాపూరంలో వైద్య శిబిరం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపూరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం రోజు ఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఏఎన్ఎం పరకాల మమత ఆధ్వర్యంలో గ్రామంలో బీపీ మరియు షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్ రజిత, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్ కౌన్సెలింగ్ పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

- కేంద్ర ప్రభుత్వంతోపాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు
- దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రవేశ పరీక్ష పవిత్రత దెబ్బతిందని వ్యాఖ్య
- కేసు తదుపరి విచారణ జులై 8కి వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం



**విశ్వంభర, ఢిల్లీ:** ఎంబీబీఎస్, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఈ ఏడాది మే 5న జరిగిన నేషనల్ ఎంట్రన్స్ కమ్ ఎలిజబిలిటీ టెస్ట్ (నీట్) ప్రవేశపరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయాలని పిటిషనర్లు కోరుతున్నారని.. దీనిపై సమాధానం చెప్పాలంటూ కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎంట్రన్స్ నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీఏ)కు నోటీసులు జారీ చేసింది. అయితే ఈలోగా జరగనున్న నీట్ కౌన్సెలింగ్ పై స్టే విధించేందుకు మాత్రం నిరాకరించింది. కేసు తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లాలతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం ఈ కేసు విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'మీరేమీ పవిత్రమైన పనిచేయలేదు. ఇది తేలికగా కొట్టిపారేసే విషయం కాదు. పరీక్షల పవిత్రత దెబ్బతింది. దీనిపై మేం సమాధానాలు కోరుకుంటున్నాం. ఎప్పటిలోగా సమాధానం చెబుతారు? కాలేజీల రీఓపెనింగ్ జరిగిన వెంటనే చెబుతారా? లేదంటే ఈలోగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ మొదలవుతుంది' అని జస్టిస్ అమానుల్లా ఎన్ టీఏ తరఫు న్యాయవాదిని ఉద్దేశించి ప్రశ్నించారు. దీనికి ఎన్ టీఏ తరఫు అడ్వొకేట్ స్పందిస్తూ ఇప్పటికే దాఖలైన మరో కేసును సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారిస్తోందని.. మే 17న తమకు నోటీసులు జారీ చేసిందని చెప్పారు. ఆ కేసు విచారణ జులై 8కి వాయిదా పడినందున ఈ కేసును కూడా అదే కేసుకు జత చేయాలని కోరారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు అడ్వొకేట్ మ్యాథ్యూస్ జె. నెడుంపరా వాదిస్తూ నీట్ కౌన్సెలింగ్ పై స్టే విధించాలని కోరారు. కానీ అందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించలేదు. 'కౌన్సెలింగ్ మొదలవనివ్వండి. మేం కౌన్సెలింగ్ ను ఆపం. ఈలోగా ఎన్ టీఏకు నోటీసులు జారీ చేయండి. వారు సమాధానం పంపుతారు' అని జస్టిస్ విక్రమ్ నాథ్ మౌఖికంగా ఆదేశించారు. నీట్ ప్రవేశపరీక్ష పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు వస్తున్నందున పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించేలా ఎన్ టీఏను ఆదేశించాలంటూ జూన్ 1న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. శివాంగీ మిశ్రా అనే వ్యక్తితోపాటు మరికొందరు ఈ పిటిషన్ వేశారు. మరోవైపు జూన్ 4న నీట్ ఫలితాలు వెలువడ్డాక కొందరు విద్యార్థులు సైతం సుప్రీంకోర్టుకెక్కారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కొందరు విద్యార్థులకు మాత్రమే గ్రేస్ మార్కులు కలపడాన్ని తప్పుబడుతూ కేసు వేశారు. కానీ ఈ కేసుపై మంగళవారం విచారణ జరగలేదు. అంతకుముందు మే 17న సైతం నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలంటూ పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ఎన్ టీఏకు నోటీసులు జారీ చేసింది. అయితే అప్పుడు ఫలితాల ప్రకటనపై స్టే విధించేందుకు నిరాకరించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్ష ఫలితాలపై స్టే విధించడం కుదరదని తేల్చి చెప్పింది. కేసు తదుపరి విచారణను జులై 8కి వాయిదా వేసింది.



## ఈ నెల 24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు!

- ఆరోజే లోక్‌సభ స్పీకర్ ఎన్నిక
- స్పీకర్ పదవి ఎవరి దక్కుతుందో ఉత్కంఠ
- ఎంపీల ప్రమాణస్వీకారానికి కార్యాచరణ సిద్ధం
- జులై 3 వరకు సమావేశాలు జరిగే అవకాశం

**విశ్వంభర, ఢిల్లీ:** కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువుతీరింది. ఈ క్రమంలో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అంతకంటే ముందుగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది. వీటికోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జూన్ 24 నుంచి జులై 3 వరకు వీటిని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జూన్ 24-25 తేదీల్లో ఎంపీల ప్రమాణ స్వీకారం, జూన్ 26న స్పీకర్ ఎన్నిక ఉండొచ్చని సమాచారం.

**స్పీకర్ పదవిపై ఉత్కంఠ!**

ఈ సమయంలో స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే అంశం ఆసక్తిగా మారింది. మోడీ 3.0 ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్నటీడీపీ, జేడీయూ ఆ పదవిని ఆశించినట్లు వార్తలు వచ్చాయి. ఇండియా కూటమి పార్టీలు సైతం స్పీకర్ పోస్టుకు పట్టుబట్టాలని వీరిపై ఒత్తిడి తేవడం గమనార్హం. మరోపక్క, రాజస్థాన్ కోటా స్థానం నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు కూడా ప్రచారంలో ఉంది.

## హత్య కేసులో నటుడు దర్శన్ అరెస్ట్



**విశ్వంభర, బెంగళూరు:** ప్రముఖ కన్నడ నటుడు, ఛాలెంజింగ్ స్టార్ దర్శన్ తూగుదీప అరెస్టయ్యారు. ఓ యువకుడి హత్య కేసులో ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు బెంగళూరు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం మైసూరులో దర్శన్తో పాటు మరో పది మందిని అరెస్టు చేశారు పోలీసులు. హత్య కేసులో విచారణ నిమిత్తం వారిని బెంగళూరుకు తరలించినట్లు కన్నడ మీడియా ప్రచారం చేస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. చిత్రదుర్గలోని లక్ష్మీ వెంకటేశ్వర బరంగయ్‌లో నివాసముంటున్న రేణుకా స్వామి జూన్ 1న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. జూన్ 8న ఆ యువకుడు హత్యకు గురయ్యాడు. జూన్ 9వ కామాక్షిపాళ్యం సమీపంలోని ఓ అపార్ట్మెంట్ పక్కన ఉన్న కాలువలో మృతదేహం కనిపించింది. కుక్కలు శవాన్ని పీక్కుతింటుండగా అపార్ట్మెంట్ సెక్యూరిటీ గార్డు పోలీసులకు సమాచారాన్ని అందించాడు. మృతుడు రేణుకా స్వామిగా గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు విచారణలో భాగంగా ఇద్దరు నిందితులు నటుడు దర్శన్ పేరు చెప్పడంతో అసలు విషయం బయటకు వచ్చింది. మంగళవారం ఉదయం మైసూర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో దర్శన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా మృతుడు రేణా స్వామి చిత్రదుర్గ దర్శన్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తెలుస్తోంది. దర్శన్ భార్యకు రేణుకా స్వామి అసభ్యకరమైన సందేశాలు పంపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

## కంగనా రనౌత్‌కు చెంపదెబ్బ అంశంపై స్పందించిన పంజాబ్ సీఎం



**విశ్వంభర, పంజాబ్ :** కంగనా రనౌత్ గతంలో మాట్లాడిన మాటల నేపథ్యంలో కోపంలోనే సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ ఆమె చెంపపై కొట్టారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. కంగనా రనౌత్‌పై చెంప దెబ్బ ఘటనపై ఆయన మొదటిసారి పెదవి విప్పారు. 'అది (కంగనకు చెంపదెబ్బ) కోపం. ఆమె గతంలో మాట్లాడిన మాటలు ఆ అమ్మాయి (సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్)ని ఆగ్రహానికి గురి చేశాయి. ఇలా జరిగి ఉండాల్సింది కాదు. కంగనా అలా మాట్లాడటం తప్పు. ఒక నటి... పబ్లిక్ ఫిగర్... ఎంపీ అయి ఉండి పంజాబే ఉగ్రవాద రాష్ట్రం అనడం సరికాదు' అని పంజాబ్ సీఎం అన్నారు.

జూన్ 6న కంగనా రనౌత్ చండీగఢ్ విమానాశ్రయంలో సెక్యూరిటీ చెక్‌కు వెళ్లినప్పుడు అక్కడున్న సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ ఆమె చెంపపై కొట్టింది. రైతుల పోరాటంలో తన తల్లి పాల్గొందని, అలాంటి పోరాటాన్ని కించపరిచినందుకు కంగనను కొట్టినట్లు కుల్విందర్ కౌర్ చెప్పారు.



## విమాన ప్రమాదంలోమలావీ దేశ వైస్ ప్రెసిడెంట్ సహా 9 మంది మృతి


**విశ్వంభర, మలావీ :** విమాన ప్రమాదంలో మలావీ వైస్ ప్రెసిడెంట్ సౌలోస్ చిలిమా (51) ప్రాణాలు కోల్పోయారు. ఆగ్నేయ ఆఫ్రికాలోని దేశం మలావీ. విమాన ప్రమాదంపై ఆ దేశ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా మంగళవారం ఓ ప్రకటన చేశారు. తమ దేశ వైస్ ప్రెసిడెంట్ సౌలోస్ చిలిమాతో పాటు మరో తొమ్మిది మంది విమాన ప్రమాదంలో మరణించారని తెలిపారు. ఆ విమానం అడవిలో కూలిపోయిందని, ఈ ఘటనలో అందులోని ఎవరూ ప్రాణాలతో మిగలలేదని లాజరస్ చక్వేరా చెప్పారు. అడవిలో ఆ విమానం ఎక్కడ కూలిపోయిందన్న విషయాన్ని అధికారులు గుర్తించారని తెలిపారు. ఇది అత్యంత విషాదకర ఘటన అని లాజరస్ చక్వేరా మీడియాకు చెప్పారు. కాగా, చిలిమా, మరో తొమ్మిది మందితో సోమవారం బయలుదేరిన సైనిక విమానం అదృశ్యమైంది. ప్రతికూల వాతావరణం వల్ల మ్జుజులో ల్యాండ్ చేద్దామనుకుని, పైలట్ ఆ ప్రయత్నాలు చేశారు. అయితే, ఆ ప్రయత్నాలు విఫలమై విమానం కుప్పకూలిందని అధికారులు గుర్తించారు. విమానం అదృశ్యమైనప్పుడు అందులోని వారి ఫోన్ల సిగ్నల్స్ అందించిన చివరి టవర్‌ను అధికారులు గుర్తించారు. దీంతో విమానం కుప్పకూలిన ప్రాంతం వద్దకు వెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి.



## రూ.300 ఆభరణాన్ని విదేశీ మహిళకు రూ.6 కోట్లకు విక్రయం

**విశ్వంభర, జైపూర్:** అమెరికా యువతిని మోసం చేసి, రూ.6 కోట్లు కొట్టేశాడు జైపూర్‌కు చెందిన ఓ నగల వ్యాపారి. రూ.300 వందల విలువజేసే నకిలీ ఆభరణాన్ని ఆమెకు రూ.6 కోట్లకు అంటగట్టాడు. జైపూర్ లో నగలు చాలా బాగుంటాయని చెరిష్ అనే అమెరికా యువతి ఇక్కడ ఆభరణాన్ని కొనాలనుకుంది. రాజస్థాన్ లోని జైపూర్, జోహ్రీ బజార్ గోల్డ్ పాలిష్ చేసిన సిల్వర్ ఆభరాన్ని ఆమెకు వ్యాపారి చూపించాడు. ఆ ఆభరణాన్ని రూ.6 కోట్లకు కొనుక్కుని వెళ్లిన యువతి.. దాన్ని అమెరికాలో ఈ ఏడాది ఏప్రిల్ లో జరిగిన ఎగ్జిబిషన్ లో ఉంచింది. దీంతో అక్కడ అది నకిలీదని తేలింది. చివరకు అసలు విషయాన్ని తెలుసుకున్న చెరిష్ మళ్లీ జైపూర్ కు వచ్చి ఆభరణాల వ్యాపారి గౌరవ్ సోనిని కలిసి, గొడవ పెట్టుకుంది. అయితే, ఆమె చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదంటూ గౌరవ్ సోని బుకాయించాడు. దీంతో ఆమె జైపూర్ లో ఫిర్యాదు దాఖలు చేసింది. అలాగే, అమెరికా రాయబార కార్యాలయ సాయం తీసుకుంది. దీనిపై విచారణ జరపాలని జైపూర్ పోలీసులకు అమెరికా రాయబార అధికారులు కూడా చెప్పారు. 2022లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గౌరవ్ సోనిని పరిచయం చేసుకున్నానని, రూ.6 కోట్లను దశ వారీగా చెల్లించానని తెలిపింది. పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో వ్యాపారి గౌరవ్ తో పాటు అతడి తండ్రి రాజేంద్ర సోని పారిపోయారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## లోక్‌సభ ఎన్నికలపై తొలిసారి స్పందించిన ఆర్ఎస్ఎస్ చీఫ్



**విశ్వంభర, నాగ్‌పూర్:** లోక్‌సభ ఎన్నికలు, పార్లమెంట్ నిర్వహణపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ తొలిసారి స్పందించారు. ఎన్నికలు ముగిసిపోయాయని, ఇక దేశ నిర్మాణంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు యుద్ధం కాదని, పోటీ మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఎన్నికలు ఏకాభిప్రాయం కోసం జరిగే ప్రక్రియ అని అన్నారు. పార్లమెంటుకు రెండు పార్శ్వాలు ఉంటాయని, కాబట్టి ఏ ప్రశ్ననైనా రెండు కోణాల్లో పరిగణించ వచ్చునని సూచించారు. ప్రతి సమస్యకు రెండు వైపులా ఆలోచించాలని, ఒక పార్టీ ఒక వైపు ప్రస్తావిస్తే.. ప్రతిపక్ష పార్టీ మరొక కోణాన్ని ప్రస్తావించాలని అన్నారు. ఈ ప్రక్రియ ద్వారా మాత్రమే సరైన నిర్ణయానికి చేరుకోగలమని భగవత్ అన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. నాగ్‌పూర్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. ఈ మేరకు నూతన ప్రభుత్వం, ప్రతిపక్షాలకు ఆయన సలహాలు ఇచ్చారు. ప్రతి ఐదేళ్లకోసారి ప్రజాతీర్పు వస్తుందని, అయితే ఈ ప్రజా నిర్ణయం ఎందుకు వస్తుంది? కారణాలు ఏంటి? అనే అంశాలు ఆర్ఎస్ఎస్‌కు సంబంధించినవి కావని భగవత్ వ్యాఖ్యానించారు. "ప్రతి ఎన్నికలలో ప్రజాభిప్రాయాన్ని మెరుగైన రీతిలో అర్థం చేసుకోవడానికి సంఘ్ పని చేస్తుంది. ఈసారి కూడా అదే పని చేసింది. ఎన్నికల ఫలితాల విశ్లేషణలోనే ఆగిపోలేదు. నేతలను ఎందుకు ఎన్నుకుంటారు? వివిధ అంశాలపై ఏకాభిప్రాయంతో పార్లమెంట్‌కు వెళ్లడానికి ఎన్నుకుంటారు. ఏకాభిప్రాయం మన సంప్రదాయం. ఆ దిశగా పురోగతి కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియ యుద్ధం కాదు.. పోటీ మాత్రమే'' మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో రెండు పక్షాలుగా విడిపోయి ప్రచారం నిర్వహించిన తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. ఎన్నికలు, పరిపాలనలను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



## యూట్యూబర్ ప్రాణాలు బలిగొన్న దాయాదుల క్రికెట్ పోరు

**విశ్వంభర, న్యూయార్క్:** టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా న్యూయార్క్ వేదికగా జూన్ 9న భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్ ఫ్యాన్స్‌కు మంచి కిక్ ఇచ్చిందనే చెప్పాలి. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో టీమిండియా విజయం సాధించింది. దీంతో న్యూయార్క్‌తో పాటు ఇండియా అంతటా అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. అయితే, పాకిస్థాన్‌లో మాత్రం మ్యాచ్ రోజే విషాదం నెలకొంది. దాయాదుల పోరు ఓ యూట్యూబర్ ప్రాణాలు బలిగొన్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్‌లో ఈ మ్యాచ్ గురించి సరదాగా వ్లాగ్ చేయబోయిన సాద్ అహ్మద్ అనే యూట్యూబర్‌ను ఓ సెక్యూరిటీ గార్డ్ తుపాకీతో కాల్చి చంపేశాడు. వివరాల్లోకి వెళితే.. చిరకాల ప్రత్యర్థుల మ్యాచ్‌పై జనాల అభిప్రాయం తెలుసుకోవాలని సాద్ అహ్మద్ అనుకున్నాడు. అందులో భాగంగా జూన్ 9వ తేదీన అతడు కరాచీలోని మొబైల్ మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ ఉన్నవాళ్లను పలకరించి భారత్, పాక్ మ్యాచ్‌పై వాళ్ల అభిప్రాయం తీసుకున్నాడు. మ్యాచ్‌లో ఎవరు గెలుస్తారు? అత్యధిక స్కోర్ కొట్టేది ఎవరు? ఇలా రకరకాల ప్రశ్నలు అడిగిన సాద్ వాళ్లతో వ్లాగ్ తీశాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ సెక్యూరిటీ గార్డ్‌ను సాద్.. టీమిండియా, పాక్ మ్యాచ్ గురించి అడిగాడు. కానీ, సెక్యూరిటీ గార్డ్ మాత్రం స్పందించలేదు. అయినా సరే సాద్ అతడిని ప్రశ్నలతో విసిగించాడు. దాంతో చిర్రెత్తుకొచ్చిన సదరు సెక్యూరిటీ గార్డ్ తన వద్ద ఉన్న తుపాకీతో సాద్‌పై కాల్పులు జరిపాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ సాద్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లారు. కానీ, మార్గ మధ్యంలోనే అతడు చనిపోయినట్లు వైద్యులు చెప్పారు

## వారణాసిలో ప్రియాంక పోటీ చేస్తే మోదీ ఓడిపోయేవారు: రాహుల్ గాంధీ




**విశ్వంభర, రాయ్‌బరేలి:** వారణాసి లోక్ సభ నియోజకవర్గం నుంచి తన సోదరి ప్రియాంకగాంధీ పోటీ చేసి ఉంటే ప్రధాని నరేంద్ర మోదీ ఓడిపోయి ఉండేవారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. వారణాసిలో కాంగ్రెస్ నేత అజయ్ రాయ్‌పై ప్రధాని మోదీ 1.52 లక్షల మెజార్టీతో గెలిచారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ... ప్రియాంక పోటీ చేసి ఉంటే మోదీ రెండు మూడు లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయేవారని వ్యాఖ్యానించారు. యూపీలోని రాయ్‌బరేలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీజేపీ బలాన్ని తగ్గించేందుకు రాయ్‌బరేలీ, అమేథీలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఇండియా కూటమి పార్టీలు ఐకమత్యంతో పోరాడాయన్నారు. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో సామాన్యులను మరిచి... పారిశ్రామికవేత్తలు, ప్రముఖులకే ప్రాధాన్యం ఇచ్చారని.. అందుకే బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. అమేథి, రాయ్‌బరేలీలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు చారిత్రాత్మక విజయాన్ని అందించారని ప్రియాంక గాంధీ అన్నారు. ఈరోజు దేశమంతా అయోధ్య వైపు చూస్తోందని... స్వచ్ఛమైన, అంకితభావంతో కూడిన రాజకీయాలు అవసరమనే సందేశాన్ని ఈ ప్రాంతం చాటిచెప్పిందన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీ శ్రేణులు ఎన్నికల్లో సమన్వయంతో సాగి భారీ విజయాన్ని కట్టబెట్టారన్నారు.

## మోదీ కా పరివార్' బలాన్నిచ్చింది...

- ఇక ఆ నినాదాన్ని తొలగించండి: ప్రధాని మోదీ
- ఎన్నికల సమయంలో మార్మోగిన మోదీ కా పరివార్ నినాదం
- మోదీ కా పరివార్ అని ఎక్స్ వేదికగా యాడ్ చేసుకున్న అగ్రనేతలు



**విశ్వంభర, ఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల సమయంలో 'మోదీ కా పరివార్' సోషల్ మీడియా నినాదం మనమంతా ఒక్కటేనని సమర్థవంతంగా చాటి చెప్పిందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఇక, ఇప్పుడు దీనిని తొలగించాల్సిందిగా ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఈ నినాదం ఎన్నికల సమయంలో బలాన్ని ఇచ్చిందన్నారు. ప్రజలు వరుసగా మూడోసారి ఎన్డీయేకు మెజార్టీ ఇచ్చారని పేర్కొన్నారు. తద్వారా నిరంతరం దేశ అభివృద్ధి కోసం పని చేయాలని తమను ఆదేశించారన్నారు. మనమంతా ఒకే కుటుంబమనే సందేశాన్ని ఇచ్చిన ప్రజలకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని... ఇప్పుడు ఆ నినాదాన్ని తొలగించాలని కోరారు. దీంతో డిస్‌ప్లే మారవచ్చును కానీ దేశ పురోగతి కోసం పరిశ్రమిస్తోన్న కుటుంబంగా మన బంధం మాత్రం బలంగా... అలాగే ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో మోదీకి కుటుంబం లేదని బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. దీనికి మోదీ కౌంటర్ ఇచ్చారు. ఈ దేశమే నా కుటుంబమని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో బీజేపీ ముఖ్య నాయకులు సహా ఎంతోమంది మోదీ కా పరివార్ అనే నినాదాన్ని ఎక్స్ ఖాతాలో తమ పేరు పక్కన యాడ్ చేసుకున్నారు.



## కారును ఓవర్ టేక్ చేశాడని అంబులెన్స్ డ్రైవర్‌పై దాడి

**విశ్వంభర, బెంగళూరు :** కారును ఓవర్ టేక్ చేశాడని ఓ వ్యక్తి అంబులెన్స్ డ్రైవర్‌పై దాడికి దిగాడు. ఈ అమానుష ఘటన బెంగళూరులో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు-తుమకూరు జాతీయ రహదారిపై ఉన్న నేల మంగల టోల్ ప్లాజా వద్ద ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఐదునెలల బాలుడిని ఆక్సిజన్ సాయంతో అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలోఅంబులెన్స్ టోల్ ప్లాజా వద్దకు రాగానే డ్రైవర్ ఓ ఇన్నోవా కారును ఓవర్ టేక్ చేశాడు. దీంతో ఇన్నోవా కారులోని వ్యక్తులు అంబులెన్స్‌ను సుమారు 5కిలోమీటర్లు వెంబడించారు. అనంతరం అంబులెన్స్‌ను ఆపి డ్రైవర్‌ను చితకబాదారు. ఈ క్రమంలో అంబులెన్స్‌లో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న బాలుడి తల్లిదండ్రులు దయచేసి వదిలేయండంటూ బతిమిలాడారు. అయినా వారు వినిపించుకోలేదు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాడి చేసిన వారిని నెటిజన్లు కామెంట్లలో తిట్టిపోస్తున్నారు.



## స్పేస్‌స్టేషన్‌లో బ్యాక్టీరియా.. డేంజర్‌లో సునీతా విలియమ్స్

**విశ్వంభర, ఢిల్లీ:** అంతరిక్ష కేంద్రంలో ఉన్న భారతీయ సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌తో పాటు మరో ఎనిమిది మంది ఆస్ట్రోనాట్స్ పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్పేస్ స్టేషన్‌లో బ్యాక్టీరియా ఉండటమే ఇందుకు కారణంగా ఈ బ్యాక్టీరియాను స్పేస్‌బగ్‌గా పిలుస్తారు. ఈ బ్యాక్టీరియా మల్టీ-డ్రగ్ రెసిస్టెంట్ కావడంతో ఆ పేరు పెట్టినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎంటిరోబ్యాక్టర్ బుగండెన్సిస్ అనే బ్యాక్టీరియా అంతరిక్ష కేంద్రంలో ఉన్నట్లు గుర్తించారు. ఇది స్పేస్‌లో సాధారణంగా ఉన్న బ్యాక్టీరియా కాదని, వ్యోమగాముల ద్వారా అక్కడికి చేరి ఉంటుందని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. స్పేస్ స్టేషన్ వాతావరణాన్ని ఆ బ్యాక్టీరియా తట్టుకుంటోందని తెలిపారు.. ఈ బ్యాక్టీరియా వ్యోమగాముల ఊపిరితిత్తులకు సోకే అవకాశం ఉన్నదని వెల్లడించారు. కాలిఫోర్నియాలోని నాసా జెట్ ప్రొపల్సన్ ల్యాబ్‌లో పనిచేస్తున్న డాక్టర్ కస్తూరి వెంకటేశ్వరన్ స్పేస్ స్టేషన్ బ్యాక్టీరియాపై అధ్యయనం చేస్తున్నారు. అంతరిక్ష కేంద్రానికి సునీతా విలియమ్స్‌తో పాటు బారీ యూజీన్ వ్యోమగామి ఇద్దరూ జూన్ 6, 2024న చేరుకున్నారు. మిగతా ఏడుగురు సిబ్బంది చాలా కాలంగా అక్కడే ఉన్నారు.



## హెబ్బె జలపాతంలో పడి హైదరాబాదీ మృతి

**విశ్వంభర, బెంగళూరు:** సరదాగా విహార యాత్రకు వెళ్లిన ఓ యువకుడు జలపాతంలో జారిపడి మృతిచెందాడు. ఈ ఘటన కర్ణాటకలోని హెబ్బె జలపాతం వద్ద జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన శ్రావణ్ ప్రముఖ ఈ- కామర్స్ కంపెనీలో సిస్టం అనలిస్టుగా పనిచేస్తున్నాడు. స్నేహితులతో టూర్ ప్లాన్ చేసుకుని అద్దెబైక్‌పై కర్ణాటకలోని పర్యాటక కేంద్రాలను చుట్టివచ్చారు. కెమ్మనగుండిలోని హెబ్బె జలపాతం చూసేందుకు వచ్చిన స్నేహితులు అక్కడ ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడిపారు. అప్పటి వరకు బాగానే ఉన్నా.. ఇటీవలి వర్షాలకు జలపాతం వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో నీటి మధ్యలో ఉన్న రాళ్లపై శ్రవణ్, అతని స్నేహితుడు సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించారు. కాలుజారడంతో ఇద్దరూ నీటిలో పడిపోయారు. నీళ్లలోని రాయి తగిలి శ్రవణ్ కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు ఈ స్నేహితులు ఇద్దరినీ ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. అంబులెన్స్ తో వచ్చిన పోలీసులు వారిద్దరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే శ్రవణ్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో స్నేహితులు శ్రావణ్ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అందివచ్చిన కొడుకు మృతిచెందడంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

విశ్వంభర V3 NEWS

# నా గురించి ట్రాఫిక్ ఆపొద్దు, రోడ్లు మూసేయొద్దు




- మామూలు మనిషిగానే రోడ్ల మీదకు వస్తా
- ఇక విధ్వంస రాజకీయాలు ఉండవు
- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశం

**విశ్వంభర, విజయవాడ:** ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమరావతినే రాజధానిగా చేస్తారని ప్రచారం జరుగుతోంది. దానికి నేడు తెర దించేశారు చంద్రబాబు నాయుడు. మంగళవారం ఆయన్ను ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎన్డీయే ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇక రాజధాని విషయంలో కూడా స్పందించారు. ఏపీకి అమరావతే రాజధానిగా ఉంటుందని తెలిపారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కర్నూలు అభివృద్ధికి కూడా తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు చంద్రబాబు నాయుడు. వైసీపీ ప్రభుత్వంలా మోసం చేయబోమని.. చెప్పిన మాటకు కట్టుబడి పనిచేస్తామన్నారు. గతంలో లాగా విధ్వంస రాజకీయాలు కాకుండా.. నిర్మాణాత్మక అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సీఎం కూడా మామూలు మనిషే.. సీఎం వస్తున్నాడు అంటే ఇక పరదాలు కట్టటం, దుకాణాలు బంద్ చేయటం, ట్రాఫిక్ నిలిపి వేయటం, చెట్లు నరకటం లాంటివి ఇకపై ఉండదు అని ఆయన చెప్పుకొచ్చారు. నా కాన్వాయ్ ఒక నిమిషం ఆలస్యమైనా పర్లేదు కానీ ట్రాఫిక్ నిబంధనలు పేరుతో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దు అని చంద్రబాబు చెప్పారు.

## ఏపీ రాజధాని ఇదే... తేల్చి చెప్పిన కాబోయే సీఎం

**విశ్వంభర, ఏపీ :** ఏపీ రాజధాని విషయంలో కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో చాలా సమస్యలు ఉన్నాయని.. రాష్ట్రం పూర్తిగా శిథిలమైందన్నారు. రైతులు అప్పుల పాలయ్యారని.. అన్ని వర్గాలు దెబ్బతిన్నాయన్నారు. ఏపీకి ఎంత అప్పు ఉందో తెలియదని.. అప్పులు ఎక్కడి నుంచి తెచ్చారో తెలియదన్నారు. ఏమేం తాకట్టు పెట్టారో తెలియని దుస్థితి ఉందన్నారు. ఇరిగేషన్ రంగాన్ని నిర్వీర్యం చేశారని.. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పదేళ్ల తర్వాత కూడా ఏపీ రాజధాని ఏది అంటే చెప్పుకోలేని దారుణ పరిస్థితి ఉందన్నారు. ఇకపై మూడు రాజధానులు అంటూ ఆటలాడే పరిస్థితి ఉండదన్నారు. అమరావతి రాజధానిగా ఉంటుందని కుండబద్దలు కొట్టారు. విశాఖను ఆర్థిక, ఆధునిక రాజధానిగా తీర్చుదిద్దుకుందామన్నారు. కర్నూలును జ్యుడీషియల్ రాజధానిగా ప్రకటించి, ఏమీ చేయలేదన్నారు. కర్నూలును కూడా అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు.



## జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్‌కల్యాణ్ ఏకగ్రీవ ఎన్నిక

**విశ్వంభర, మంగళగిరి:** జనసేన శాసనసభాపక్ష నేతగా పవన్‌కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేల సమావేశం ఇవాళ(మంగళవారం) ముగిసింది. ఈ భేటీలో ఆ పార్టీ శాసనసభాపక్ష నేతగా పవన్‌కల్యాణ్ పేరును ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్‌ను ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా విజయవాడలో జరగబోయే ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల సమావేశానికి పవన్‌తో పాటు జనసేన ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే లు భేటీ అయ్యారు. ఎమ్మెల్యేలతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా అధిష్ఠానం ప్రకటనకు అందరూ కట్టుబడి ఉం డాలని నిర్ణయించారు. కూటమిపై విశ్వాసంతో మంచి విజయాన్ని సాధించారని అభినందించారు. సీఎం ప్రమాణ స్వీకార సభకు ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా రానున్నారని తెలిపారు. రాష్ట్ర బీజేపీ తరఫున సభకు హాజరవుతున్నట్లు పురందేశ్వరి వెల్లడించారు.



## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చిరంజీవికి ప్రత్యేక ఆహ్వానం

**విశ్వంభర, ఏపీ :** తన ప్రమాణ స్వీకారానికి రావాలని మెగాస్టార్ చిరంజీవికి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రత్యేక ఆహ్వానం పంపించారు. రాష్ట్ర నుంచి ప్రత్యేక అతిథిగా హాజరు కావాలని కోరారు. ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులతో పాటు పలువురు సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులకు ఆహ్వానాలు అందజేశారు. కాగా, బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. కేసరపల్లి ఐటీ పార్కు ప్రాంగణంలో ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. దీంతో ప్రధాని పర్యటనకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకున్నారు. మరోవైపు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో విజయవాడలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రత్యామ్నాయ రూట్‌లను సూచించారు. అంబులెన్స్, అత్యవసర ఆరోగ్య చికిత్స వాహనాలకు మాత్రమే అనుమతి ఉండనుంది.

## ప్లేటు తిప్పేసిన స్వరూపానంద స్వామి.. జగన్ పై విమర్శలు..!



**విశ్వంభర, విశాఖపట్నం:** విశాఖ కేంద్రంగా ఆశ్రమాన్ని నడిపిస్తున్న స్వరూపానంద స్వామి తాజాగా ప్లేటు ఫిరాయించేశారు. ఆయన ఎన్నికలకు ముందు జగన్ కు వంత పాడారు. జగన్ జాతకం ప్రకారం వైసీపీకి 123కి పైగా సీట్లు వస్తాయని.. అధికారంలోకి వస్తారని చెప్పారు. కానీ వైసీపీ దారుణంగా ఓడిపోయింది. చరిత్రలో ఎన్నడూ లేనంత దారుణమైన సీట్లు సాధించుకుంది. దాంతో స్వరూపానంద స్వామి తాజాగా ప్లేటు తిప్పేశారు. ఏకంగా ప్రెస్ మీట్ పెట్టి మరీ జగన్ పై విమర్శలు గుప్పించారు. చంద్రబాబును ఆకాశానికి ఎత్తేశారు. వాస్తవానికి జగన్ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు స్వరపానంద ఆశ్రమంలో వైసీపీ నేతలే ఎక్కువగా కనిపించారు. జగన్ ఆశ్రమానికి ఎంతో సాయం చేశారు. అయినా సరే ఇప్పుడు స్వరూపానంద ఇలా మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక చంద్రబాబు పెద్ద వాడు.. ఆయన కుటుంబం బాగుండాలని ఆయన రాష్ట్రాన్ని బాగా పరిపాలించాలని కోరుకుంటున్నానని తెలిపారు. తాను ఇలా చంద్రబాబును పొగడటం కొత్తేమీ కాదని..

గతంలో కూడా చంద్రబాబు గెలవాలని యాగాలు చేసినట్టు గుర్తు చేశారు. జగన్ కొన్ని తప్పులు చేశాడని.. చెబితే వినలేదన్నారు. శ్రీశైలం కుంభాభిషేకం ఆపాలని చెబితే.. జగన్ కోర్టులను మేనేజ్ చేసి ఆ అభిషేకం చేశారు. దాంతో పాటు తిరుమల అలాగే సింహాచలంలో జరిగిన తప్పులను నేను ఎత్తి చూపాను. వద్దని చెబితే వినలేదు. అందుకే వైసీపీ ఓడిపోయింది అంటూ చెప్పారు. అయితే ఆయన ఇలా సడెన్ గా ప్లే తిప్పేయడంపై వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## కాన్వాయ్ వెంట మహిళ పరుగులు..

### కారు ఆపి మాట్లాడిన చంద్రబాబు

**విశ్వంభర, విజయవాడ:** ఎన్నికల్లో గెలిచిన తర్వాత చంద్రబాబు అందరి అభిమానాన్ని చూరగొంటున్నారు. విజయవాడలో కూటమి ఎమ్మెల్యేల సమావేశానికి వెళ్లిన చంద్రబాబుకు ఊహించని సంఘటన ఎదురైంది. సమావేశానికి వచ్చిన చంద్రబాబు నాయుడుని చూసేందుకు విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌కు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. టిక్కిల్ రోడ్డులో పెద్ద ఎత్తున బారులు తీరారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు దారి పొడవునా స్వాగతం పలికారు. ఓ మహిళ చంద్రబాబు కాన్వాయ్ వెంట పరుగులు తీసింది. చంద్రబాబును చూడ్డానికి కాన్వాయ్ వెంట పరుగులు తీసింది. బాబును చూడాలి అంటూ కాన్వాయ్ వెంట మహిళ రావడాన్ని చంద్రబాబు గమనించారు. వెంటనే కారును ఆపి ఆ మహిళతో మాట్లాడారు. సెక్యూరిటీని వారించి ఆమె వివరాలు తెలుసుకున్నారు. మా కష్టం ఫలించి.. సార్. మా కోరిక మేరకు మీరు సీఎం అయ్యారంటూ కాళ్లు మొక్కుతా అంటూ చంద్రబాబు కాళ్లు పట్టుకునే ప్రయత్నం చేసింది. చంద్రబాబు సున్నితంగా వారించారు. ఆమెతో ఆప్యాయంగా మాట్లాడి ఫొటో దిగారు. తనకు జ్వరం ఉన్నా చూడాలని వచ్చానని నందిని చెప్పగా ముందు ఆసుపత్రికి వెళ్లాలని చంద్రబాబు సూచించారు. ఆమె ఎక్కడ ఉంటారో తెలుసుకుని అవసరమైన వైద్యం సాయం చేయాలని పార్టీ నేతలకు చంద్రబాబు సూచించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యేలతో సమావేశంలో వేదికపై ప్రత్యేక కుర్చీని ఏర్పాటు చేయగా అందరితో పాటు తనకు సమానమైన కుర్చీ వేయాలని సిబ్బందికి సూచించి ఆశీనులయ్యారు. ఇలా చంద్రబాబు తనదైన మంచిమనసుతో అందరి మనసులు దోచుకుంటున్నారు.




## నేడు గన్నవరం ఎయిర్‌పోర్టు పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**విశ్వంభర, గన్నవరం :** బుధవారం ఉదయం 11.27 గంటలకు ఏపీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ ఆంక్షల దృష్ట్యా విమాన ప్రయాణికులకు ప్రత్యేక సూచనలు చేయడం జరిగింది. ఈ క్రమంలో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన విమాన ప్రయాణికులు ఉదయం 9.30 గంటల లోపే విమానాశ్రయానికి చేరుకోవాలని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సూచించారు. నేటి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. విమాన సర్వీసులన్నీ యథాతథంగా నడుస్తాయని తెలిపారు.

## 'జగనన్నను సీఎం చేయాలి.. లేదంటే ఆత్మహత్య చేసుకుంటా'



**విశ్వంభర, రాజమండ్రి:** కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలు ఉన్నట్లు ఏపీ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఓటమికి అనేక కారణాలు ఉన్నాయి. అయితే జగన్ ఓటమిని ఆ పార్టీ నేతలు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ తరుణంలో ఓ యువకుడు జగన్ ఓటమిపై విచారణ జరపాలని, జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తన భార్యాపిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని అన్నాడు. ఆ యువకుడి వ్యాఖ్యలు ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ వీడియోలో సదరు యువకుడు ఇలా మాట్లాడాడు 'నా లాంటి పేదలకు జగనన్న ఎంతో మేలు చేశాడు. ఎంతోమందికి ఉపకారం చేసిన వ్యక్తి ఇంత ఘోరంగా ఓడిపోవడం ఏంటీ? ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందని, మరొకటని.. ఇలా ఏవేవో అంటున్నారు. ఎవరు ఏం చేస్తారో తెలియదు కానీ మాకు న్యాయం జరగాలి. జగనన్న మళ్లీ సీఎం కావాలి. లేదంటే భార్యా పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటా. అలా కాకుండా తమను కాపాడేందుకు ఎవరైనా బ్రిడ్జిపైకి వస్తే గోదావరిలో దూకేస్తా. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయకముందే ఈ ఎన్నికల ఫలితాలపై విచారణ జరిపించి న్యాయం చేయాలి. ఈ వీడియో జగనన్న, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సహా పెద్దలందరికీ చేరాలి' అంటూ కోరాడు. సదరు వ్యక్తిది బ్రాహ్మణగూడెం అని, అతడు జగన్‌కు వీరాభిమాని అని సమాచారం.

## ఏపీలో ఉచిత బస్ ప్రయాణంపై ప్రభుత్వం కసరత్తు



**విశ్వంభర, విశాఖపట్నం:** ఏపీ ఎన్నికల సమయంలో ఎన్డీయే కూటమి సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన కూటమి ఈ కీలక హామీ అమలుపై కసరత్తు చేస్తోంది. దీనికి సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేశారు. వీటిలో ఏది ఏపీలో అమలుకు వీలవుతుందనే అంశాన్ని పరిశీలించి ప్రాథమికంగా ఓ నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదిక ప్రకారం తెలంగాణ అనుసరిస్తున్న విధానమే ఏపీకి సరిపోతుందని అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో ఉన్నట్లే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. అదేవిధంగా విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని కల్పిస్తోంది. మరి ఏపీ సర్కార్ కొత్త జిల్లాల పరిధి లోపే పరిమితి ఉంటుందా లేక.. పాత ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉంటుందా? రాష్ట్రమంతా ఎక్కడికైనా ప్రయాణానికి అవకాశం ఇస్తారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సివుంది. అది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

## శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు ఏకగ్రీవం

- ప్రతిపాదించిన జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్
- ఏకగ్రీవంగా అంగీకరించిన కూటమి నేతలు
- ప్రభుత్వం ఏర్పాటుకు నేడు గవర్నర్ ఆహ్వానం
- ఉదయం 11.27 గంటలకు సీఎంగా ప్రమాణ స్వీకారం




**విశ్వంభర, విజయవాడ:** టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి శాసనసభా పక్ష సమావేశం ప్రారంభమైంది. కూటమి తరఫున గెలుపొందిన ఎమ్మెల్యేలు విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును కూటమి శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. చంద్రబాబును సీఎం అభ్యర్థిగా ప్రతిపాదించారు పవన్ కల్యాణ్. ఈ ఏకగ్రీవ తీర్మానాన్ని కూటమి నేతలు గవర్నర్‌కు పంపిస్తారు. ప్రభుత్వ ఏర్పాటుకు కూటమికి గవర్నర్ ఆహ్వానించనున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విపత్కర పరిస్థితులను ఎదుర్కొందని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టేందుకు చంద్రబాబు లాంటి అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరమని అభిప్రాయపడ్డారు. అనంతరం చంద్రబాబును ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. మరోవైపు జనసేన శాసనసభా పక్ష నేతగా పవన్ కల్యాణ్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ నేతలు పవన్ కల్యాణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా, బీజేపీ శాసనసభా పక్ష ఎంపికపై చర్చలు కొనసాగుతున్నాయి. ఏపీలోని విజయవాడలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి హాజరయ్యారు. అధిష్టానం ప్రకటనకు కట్టుబడి ఉండాలని సూచించారు. శాసనసభా పక్ష సమావేశంలో పాల్గొని అభిప్రాయాలను వివరిస్తామని వెల్లడించారు.



## జగన్ కు చంద్రబాబు వార్నింగ్..!

**విశ్వంభర, విజయవాడ:** చంద్రబాబును మంగళవారం ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. తనను ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. ఏపీలో ఇప్పుడు నిర్మాణాత్మక అభివృద్ధి జరగాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఇక ఏపీ రాజధానిగా అమరావతే ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చి దిద్దుతామన్నారు. అంతే కాకుండా రాబోయే రోజుల్లో ఎవరూ కూడా పదవి వచ్చిందని విర్రవీగొద్దంటూ తెలిపారు. ఇక ఇదే సందర్భంగా జగన్ కు ఇన్ డైరెక్టుగా వార్నింగ్ ఇచ్చారు చంద్రబాబు నాయుడు. తప్పు చేసిన వారికి శిక్ష పడాలని.. లేదంటే అదే తప్పు చేయడం వారికి అలవాటుగా మారుతుందని ఆయన తెలిపారు. నా కుటుంబానికి అవమానం జరిగింది. అది కౌరవ సభ అని గౌరవ సభగా మార్చిన తర్వాతనే వస్తానని చెప్పి బయటకు వచ్చాను. ప్రజలు నా తీర్పును గౌరవించారు. కాబట్టి ప్రజలను నిలబెట్టాలి అంటూ చెప్పుకొచ్చారు చంద్రబాబు. చంద్రబాబు మాటలను బట్టి చూస్తుంటే జగన్ ను వదిలిపెట్టబోరని తెలుస్తోంది.



## టీటీడీ చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి రాజీనామాకు ఆమోదం

**విశ్వంభర, తిరుపతి:** తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా భూమన కరుణాకర్ రెడ్డి రాజీనామాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆమోదించింది. ఆయన రాజీనామాను ఆమోదిస్తూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వలవన్ నోటిఫికేషన్ ఇచ్చారు.గత ప్రభుత్వం 05 అగస్ట్ 2023న ఆయనను టీటీడీ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అద్భుత విజయం సాధించడంతో నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు వరుసగా రాజీనామా చేశారు. భూమన జూన్ 4న చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.



## కుర్చీ మార్చేసిన చంద్రబాబు.. కారణమేంటంటే?

**విశ్వంభర, విజయవాడ:** ఎన్డీయే కూటమి తరఫున శాసనసభా పక్ష నేతగా చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. విజయవాడలో మంగళవారం నిర్వహించిన ఈ వేదికై ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. సమావేశంలో వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి, అచ్చెన్నాయుడు కోసం కుర్చీలు వేశారు. అయితే చంద్రబాబు కోసం పసుపురంగులో ప్రత్యేక కుర్చీ వేశారు. ఈ సమావేశానికి వచ్చిన వెంటనే చంద్రబాబు ముఖ్యనేతలకు, కార్యకర్తలకు అభివాదం చేసి ఆ కుర్చీలో కూర్చున్నారు. అయితే, కుర్చీ ప్రత్యేకంగా ఏర్పాటు చేయడాన్ని గమనించిన చంద్రబాబు వెంటనే తన సిబ్బందికి సూచన చేశారు. మిగతా కుర్చీలకు తన కుర్చీకి తేడాను చూపిస్తూ.. అలాంటి తేడాలు ఏవీ చూపించొద్దని, తనకూ మిగతా వాళ్లలాగే సాధారణ కుర్చీని తెమ్మని ఆదేశించారు. దీంతో సిబ్బంది చంద్రబాబు కుర్చీని వెంటనే మార్చేశారు. మరో సాధారణ కుర్చీని సిబ్బంది తీసుకురాగానే చంద్రబాబు లేచి ఆ కుర్చీలో ఆసీనులయ్యారు. దీనికి సంబంధించిన వీడియోను టీడీపీ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఇది చంద్రబాబు గారి సంస్కారం. కూటమి నేతలు పవన్ కల్యాణ్ గారు, పురందేశ్వరి గారికి గౌరవం ఇస్తూ, తనకు వేసిన ప్రత్యేకమైన కుర్చీని వద్దని, వాళ్లు కూర్చున్న కుర్చీ లాంటిదే తెమ్మని చెప్పిన చంద్రబాబు గారు' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



## ‘ఐవోఎస్ 18’ని ఆవిష్కరించిన యాపిల్..

**విశ్వంభర, బిజినెస్ :** ఐఫోన్ ప్రియులకు కీలక అప్‌డేట్ వచ్చింది. నెక్స్ట్ జనరేషన్ ఆపరేటింగ్ సిస్టమ్ ‘ఐవోఎస్ 18’ని యాపిల్ కంపెనీ ఆవిష్కరించింది. కంపెనీ ‘వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్ 2024’లో దీనిని విడుదల చేసింది. ఈ కొత్త ఐవోఎస్‌లో పలు ఆకర్షణీయమైన నూతన ఫీచర్లు ఉన్నాయి. హోమ్ స్క్రీన్ కస్టమైజేషన్, కంట్రోల్ సెంటర్ రీవాంప్, మెసేజుల యాప్‌కి అప్‌డేట్స్, ట్యాప్ టు క్యాష్‌తో పాటు ఇతర ఫీచర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఐవోఎస్ 18 ద్వారా యాపిల్ కొన్ని అదిరిపోయే ఫీచర్లు అందించింది. థీమింగ్స్ ఆప్షన్ల ద్వారా యాప్ ఐకాన్‌లను హోం స్క్రీన్‌పై నచ్చిన విధంగా మార్చుకోవచ్చు. డార్క్ మోడ్‌లో యూజర్లు తమకు నచ్చిన విధంగా యాప్‌లను మార్చుకోవచ్చు. ఇక మల్టీపుల్ లేఅవుట్లు చేసుకునేందుకు వీలుగా కంట్రోల్ సెంటర్ ఫీచర్ అప్‌డేట్‌ను యాపిల్ అందించింది. కంట్రోల్ సెంటర్‌కు అవసరమైన విభిన్న లేఅవుట్ విడ్జెట్ల కోసం థర్డ్ పార్టీ డెవలపర్స్ అనుమతి కూడా ఉంటుంది. ఇక ఫ్లాష్‌లైట్, కెమెరా ఐకాన్లను లాక్ స్క్రీన్‌పైకి తీసుకోవచ్చు. ఐవోఎస్ 18పై మరో ముఖ్యమైన ఫీచర్ ఏంటంటే.. పర్సనల్ యాప్‌లను ఫేస్ ఐడీతో లాక్ చేసుకోవచ్చు. మెసేజెస్ యాప్‌లో ఏదైనా ఒక ఎమోజీ లేదా స్టిక్కర్‌ను తిరిగి ట్యాప్ చేసుకునేలా ట్యాప్‌బ్యాక్‌లను రీడిజైన్ చేసింది. అంతేకాదు మెసేజులను షెడ్యూల్ చేసి పంపించవచ్చు. అండర్‌లైన్ వంటి టెక్స్ట్ ఎఫెక్ట్‌లు, ఫార్మాటింగ్ ఆప్షన్లు కూడా కొత్త ఐవోఎస్‌లో ఉన్నాయి. మరిన్ని ఫీచర్ల విషయానికి వస్తే ఐఫోన్ 14, ఐఫోన్ 15 యూజర్లు వైఫై లేదా సెల్ సర్వీసు లేకుండానే ఐమెసేజులను పంపించుకోవచ్చు. శాటిలైట్ ద్వారా ఈ లేటెస్ట్ సేవను పొందవచ్చు. ఇక మెయిల్ యాప్ ఆటోమేటిక్‌గా కేటగిరి అయి ఉంటుంది. దీంతో పాటు యాపిల్ మ్యాప్స్‌ను ఆఫ్‌లైన్‌లో కూడా ఉపయోగించవచ్చు. ఈ మేరకు టోపోగ్రాఫిక్ మ్యాప్‌లను ఐవోఎస్ 18 జోడించింది. యాపిల్ వాలెట్ అయిన యాపిల్ క్యాష్ కోసం ట్యాప్-టు-పే ఫీచర్‌ను కంపెనీ అందించింది. ఈ ప్లాట్‌ఫామ్‌పై పేమెంట్లు చేయడమే కాకుండా ఈవెంట్ టిక్కెట్‌లకు మరింత సులువుగా బుక్ చేసుకోవచ్చు. గేమ్ మోడ్, క్యాలెండర్‌లో రిమైండర్స్ ఇంటిగ్రేషన్‌తో పాటు పలు ఫీచర్లను అందించింది.

## సిక్కు కమ్యూనిటికీ క్షమాపణలు చెబుతున్నా..
### కమ్రాన్ అక్మల్



**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్ ఇండియా పేసర్ అర్షదీప్ సింగ్‌ను హేళన చేస్తూ సిక్కులపై మాజీ క్రికెటర్ కమ్రాన్ అక్మల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. తాజాగా సిక్కు కమ్యూనిటీ తనను క్షమించాలని అక్మల్ కోరాడు. ఇటీవల ఇండియా, పాక్ మ్యాచ్ సందర్భంగా ఓ న్యూస్ చానెల్ డిబేట్‌లో పాల్గొన్న అక్మల్.. పాకిస్తాన్ ఇన్నింగ్స్‌లో ఆఖరి ఓవర్ వేస్తున్న అర్షదీప్ సింగ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. సిక్కులను అవమానపరిచేలా ఉన్న అతని వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది.దీనిపై హర్భజన్ సింగ్ ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ అక్మల్‌ను కడిగిపారేశాడు. అక్మల్ మీ చెత్త నోరు తెరిచే ముందు సిక్కుల చరిత్ర తెలుసుకోవాలి. మీ తల్లులు, సోదరీమణులను ఆక్రమణదారులు అపహరించినప్పుడు సమయం 12:00 గంటలే. సిక్కులమైన మేమే వారిని రక్షించాం. సిగ్గుపడండి. కాస్తయినా కృతజ్ఞత ఉండాలి.’అని మండిపడ్డారు.ఈ నేపథ్యంలో ...’నా వ్యాఖ్యలు అగౌరవంగా ఉన్నాయి. హర్భజన్ సింగ్, సిక్కు కమ్యూనిటికీ క్షమాపణలు చెబుతున్నాను. సిక్కులపై నాకు అపారమైన గౌరవం ఉంది. ఎవరినీ బాధపట్టాలనే ఉద్దేశంతో అనలేదు. నన్ను క్షమించండి’ ఎక్స్ వేదికగా అక్మల్ క్షమాపణలు కోరాడు.

# బంగ్లాదేశ్ కొంపముంచిన ఐసీసీ రూల్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** అమెరికా, వెస్టిండీస్ దేశాలు ఆతిథ్యం ఇస్తున్న మ్యాచులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. బౌలర్ల హవా కొనసాగుతుండడంతో లోస్కోరింగ్ మ్యాచ్‌లు నమోదు అవుతున్నాయి. న్యూయార్క్‌లోని నాసా కౌంటీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సోమవారం రాత్రి దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో సౌతాఫ్రికా నాలుగు పరుగుల తేడాతో విజయాన్ని సాధించింది. కాగా.. ఈ మ్యాచ్‌లో ఓ ఐసీసీ రూల్ బంగ్లాదేశ్ కొంపముంచింది. లేదంటే మ్యాచ్ ఫలితం వేరేలా ఉండే అవకాశం ఉంది.ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మొదట బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. సఫారీ బ్యాటర్లలో హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 46) టాప్ స్కోరర్. అనంతరం ఛేదనలో బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 109 పరుగులకే పరిమితమైంది. తౌహిద్ హృదోయ్ (34 బంతుల్లో 37) పోరాడినా ఓటమి తప్పలేదు.



### అసలేం జరిగిందంటే..?

బంగ్లాదేశ్ విజయానికి ఆఖరి నాలుగు ఓవర్లలో 27 పరుగులు అవసరం. ఇన్నింగ్స్ 17వ ఓవర్‌ను బార్ట్‌మన్ వేశాడు. ఈ ఓవర్‌లోని రెండో బంతిని మహ్మదుల్లా ఫ్లిక్ చేయడానికి ప్రయత్నించగా బంతి అతడి ప్యాడను తగిలి ఫైన్ లెగ్ మీదుగా బౌండరీకి వెళ్లింది. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు అప్పీల్ చేయగా అంపైర్ ఎల్బీడబ్ల్యూగా ఔట్ ఇచ్చాడు. బంగ్లా బ్యాటర్ వెంటనే రివ్యూకి వెళ్లాడు. రిప్లైలో అది నాటౌట్‌గా తేలింది. దీంతో ఆన్‌ఫీల్డ్ అంపైర్ తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. ఆ బంతికి అతడు ఔట్ కానప్పటికి బంగ్లాదేశ్ స్కోరుకు నాలుగు పరుగులు కలపలేదు. ఇందుకు కారణం అంపైర్ వేలు ఎత్తడడంతో ఆ బంతిని డెడ్‌బాల్‌గా పరిగణించారు. అక్కడ అంపైర్ పొరబాటు ఉన్నప్పటికీ ఐసీసీ రూల్ బుక్‌లోని డెడ్ బాల్ చట్టంలోని 20.1.1.3 నిబంధన ప్రకారం బంగ్లాకు పరుగులు కలపడం సాధ్యపడలేదు. ఉదాహరణకు.. ప్యాడ్లకు బాల్ తగిలిన తర్వాత ఓ బ్యాటర్ సింగిల్ తీశాడు. ఈ లోపు అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. అనంతరం బ్యాటర్ రివ్యూకి వెళ్లి నాటౌట్ అని తేలినా ఆ ఒక్క పరుగు స్కోరు బోర్డులో నమోదు కాదు. బంతిని కౌంట్ చేస్తారు. ఇలాంటి సమయాల్లో బ్యాటింగ్ టీమ్‌కు నష్టం జరుగుతంది. కాగా.. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆఖరికి నాలుగు పరుగులతో ఓడిపోవడంతో ఈ రూల్ పై ప్రస్తుతం చర్చమొదలైంది. పలువురు మాజీ ఆటగాళ్లు ఈ నిబంధనను మార్చాలని కోరుతున్నారు.

# ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్ల జాతర

**విశ్వంభర, బిజినెస్ :** భారతదేశంలో పెట్టుబడిదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు స్థిర ఆదాయాన్ని అందించే నమ్మకమైన పెట్టుబడి ఎంపికగా నిలిచాయి. రాబడి తక్కువైనా పెట్టుబడితో పాటు రాబడికి కూడా హామీ ఉంటుందనే ఉద్దేశంతో ఎఫ్‌డీల్లో పెట్టుబడికి చాలా మంది పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో అన్ని బ్యాంకులు ఖాతాదారులను ఆకట్టుకునేందుకు ఎఫ్‌డీల్లో పెట్టుబడిపై ఆకర్షణీయ వడ్డీ రేట్లను అందిస్తూ ఉంటారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 2 కోట్ల కంటే తక్కువ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. కొత్త రేట్లు జూన్ 10, 2024 నుంచి అమలులోకి వచ్చాయి. సాధారణ పౌరులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏడు రోజుల నుంచి పది సంవత్సరాల వరకు ఉన్న కాల వ్యవధిపై 3 శాతం నుంచి 7.25 శాతం మధ్య వడ్డీ రేట్లను అందిస్తుంది. అత్యధిక వడ్డీ రేటు 18 నెలల నుండి 21 నెలల కంటే తక్కువ కాల వ్యవధిపై 7.25 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజా వడ్డ రేట్ల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.



### హెచ్‌డీఎఫ్‌సీ ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు ఇలా

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుతం సాధారణ పౌరులకు 7 నుంచి 29 రోజుల మధ్య మెచ్యూర్ అయ్యే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 3 శాతం వడ్డీ రేటును అందిస్తుంది.
- 30 నుంచి 45 రోజుల మధ్య మెచ్యూర్ అయ్యే డిపాజిట్లు 3.50 శాతం వడ్డీని పొందవచ్చు.
- 46 రోజుల నుంచి ఆరు నెలల లోపు మధ్య మెచ్యూరిటీ ఉన్న ఎఫ్‌డీలకు 4.50 శాతం వడ్డీ లభిస్తుంది.
- ఆరు నెలల నుంచి తొమ్మిది నెలల లోపు మెచ్యూర్ అయ్యే డిపాజిట్ల కోసం బ్యాంక్ 5.75 శాతం వడ్డీ రేటును ఇస్తుంది.
- తొమ్మిది నెలల నుంచి ఒక సంవత్సరం లోపు మెచ్యూర్ అయ్యే డిపాజిట్లపై బ్యాంక్ 6 శాతం వడ్డీ రేటును ఇస్తుంది.
- ఒక సంవత్సరం నుంచి 15 నెలల కంటే తక్కువ కాల వ్యవధిలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లకు 6.60 శాతం వడ్డీ వస్తుంది.
- 15 నెలల నుంచి 18 నెలల కంటే తక్కువ కాల వ్యవధి ఉన్న ఎఫ్‌డీలకు 7.10% వడ్డీ రేటు లభిస్తుంది.
- 18 నెలల నుంచి 21 నెలల కంటే తక్కువ వ్యవధిలో బ్యాంక్ 7.25 శాతం వడ్డీను పొందవచ్చు.
- అయితే 21 నెలల నుంచి రెండు సంవత్సరాల పదకొండు నెలల లోపు మెచ్యూరిటీ డిపాజిట్లపై 7 శాతం వడ్డీ రేటును ఆఫర్ చేస్తుంది.
- 2 సంవత్సరాల 11 నెలల నుంచి 3 సంవత్సరాల కంటే తక్కువ, 2 సంవత్సరాల 1 రోజు నుంచి 2 సంవత్సరాల 11 నెలల కంటే తక్కువ కాల వ్యవధిపై 7.15 శాతం వడ్డీ పొందవచ్చు.
- ఐదు సంవత్సరాల 1 రోజు నుంచి 10 సంవత్సరాల కాలవ్యవధిపై 7 శాతం వడ్డీ రేటును అందిస్తుంది.

### రికరింగ్ డిపాజిట్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 27 నెలల నుంచి 36 నెలల కాలవ్యవధిలో రికరింగ్ డిపాజిట్ వడ్డీ రేట్లను సవరించింది. ఇది సాధారణ పౌరులకు 7.15 శాతం ఉంటే సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. 39 నెలలు, 48 నెలలు, 60 నెలల కాలవ్యవధి కోసం, బ్యాంక్ సాధారణ పౌరులకు 7.20 శాతం వడ్డీను అందిస్తుంటే సీనియర్ సిటిజన్లకు 7.70% అందిస్తుంది.

## ప్రేయసిని పెళ్లాడిన ఇంగ్లాండ్ మహిళా స్టార్ క్రికెటర్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఇంగ్లాండ్ మహిళా స్టార్ క్రికెటర్ డేనియల్ వ్యాట్ పెళ్లి చేసుకుంది. ఆమె తన ప్రియురాలు జార్జి హాడ్జ్‌తో కలిసి ఏడు అడుగులు వేసింది. లండన్‌లోని చెల్సియా ఓల్డ్ టౌట్ హాల్‌లో జూన్ 10న వీరిద్దరు వివాహబంధంతో ఒక్కటి అయ్యారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా స్వయంగా తెలియజేశారు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను పంచుకున్నారు. ఈ ఫోటోలు వైరల్‌గా మారగా.. ఈ విషయం తెలిసిన అభిమానులు, నెటిజన్లు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 33 ఏళ్ల ఆల్‌రౌండర్ అయిన డేనియల్ వ్యాట్, జార్జి హాడ్జ్ 2019 నుంచి డేటింగ్‌లో ఉన్నారు. 2023 ప్రారంభంలో దక్షిణాఫ్రికాలో ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు. నిశ్చితార్థం తరువాత వీరిద్దరు తమ బంధాన్ని స్వయంగా వెల్లడించారు. దీంతో చాలా మంది ఆశ్చర్యపోయారు. కాగా.. జార్జి హాడ్జ్ సీసీఏఏ బేస్‌కు చెందిన ఓమహిళా ఫుట్‌బాల్ జట్టుకు హెడ్‌గా ఉంది. లండన్‌లో ఎఫ్‌ఏ లైసెన్స్‌డ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. వ్యాట్ ఇంగ్లాండ్ తరఫున ఇప్పటి వరకు 2 టెస్టులు, 110 వన్డేలు, 156 టీ20లు ఆడింది. టెస్టుల్లో 129 పరుగులు, వన్డేల్లో 1907 పరుగులు, టీ20ల్లో 2726 పరుగులు చేసింది. కాగా.. వన్డేలు, టీ20ల్లో రెండేసి సెంచరీలు చేసింది. ఇక బౌలింగ్‌లో వన్డేల్లో 27 వికెట్లు, టీ20ల్లో 46 వికెట్లు పడగొట్టింది.





## పుష్ప రాజ్ స్టైల్‌లో అదరగొట్టిన డేవిడ్ వార్నర్..

**విశ్వంభర, స్పోర్ట్స్ :** ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. గ్రౌండ్ లో ధనాధాన్ ఇన్నింగ్స్ లు ఆడే ఈ మేటి బ్యాటర్ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటాడు. సినిమా డైలాగులు, ఫైట్స్, సాంగ్స్ ను రీక్రియేట్ చేస్తూ తన అభిమానులను అలరిస్తుంటాడు. ముఖ్యంగా తెలుగు సినిమాలంటే డేవిడ్ భయ్యాకు చాలా ఇష్టం. అందుకే కరోనా టైమ్ లో టాలీవుడ్ హీరోల డైలాగ్స్, పాటలకు రీల్స్ చేసి తెలుగు వారికి బాగా దగ్గరయ్యాడు. ఇక పాన్ ఇండియా సినిమా పుష్ప కు బ్రాండ్ ప్రమోటర్ గా మారిపోయాడీ డ్యాషింగ్ బ్యాటర్. అందులోని పాటలకు, డైలాగ్సులను ఎక్కువగా రీక్రియేట్ చేసిన వార్నర్ ఆ వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోగా అవి కాస్తా వైరలయ్యాయి. తాజాగా మరోసారి తెలుగు ఆడియెన్స్ మనసు దోచుకున్నాడు డేవిడ్ భాయ్. ఎంతలా అంటే టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సైతం డేవిడ్ వార్నర్ కు రిప్లై ఇచ్చేలా.. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం టీ 20 ప్రపంచకప్ కోసం అమెరికాలో బీజీబిజీగా ఉంటున్నాడు డేవిడ్ వార్నర్. తాజాగా అతను ఓ కమర్షియల్ యాడ్ లో నటించాడు. ఇందుకు సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశాడు.



## బుమ్రా కపుల్ ఇంటర్వ్యూ వైరల్..

విశ్వంభర, స్పోర్ట్స్ : టీ20 ప్రపంచకప్‌లో మరోసారి పాకిస్తాన్‌ను భారత్ మట్టి కరిపించింది. ఆదివారం న్యూయార్క్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ పై భారత్ 6 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత జట్టు విజయం సాధించడంలో టీమ్ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా కీలక పాత్ర పోషించాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో 14 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. కాగా.. మ్యాచ్ అనంతరం బుమ్రాను అతడి భార్య, టీవీ ప్రజెంటర్ సంజనా గణేషన్ ఇంటర్వ్యూ చేసింది. బుమ్రా మాట్లాడుతూ.. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లుగా బౌలింగ్ చేసి మంచి ఫలితాన్ని రాబట్టినట్లు చెప్పాడు. కాగా.. పాక్ ఇన్నింగ్స్ ఆరంభంలో తాము విధించిన లక్ష్యం సరిపోదని భావించినట్లు తెలిపాడు. సూర్యుడి రాకతో పిచ్ మెరుగుఅవ్వడంతో విజయం సాధించడం కష్టమని భావించినట్లు చెప్పాడు. అయినప్పటికీ క్రమ శిక్షణతో బౌలింగ్ చేసి మంచి ఫలితాన్ని రాబట్టాం. నా బౌలింగ్ ప్రదర్శన నాకు సంతృప్తినిచ్చింది అని అన్నాడు. ఇదే జోరును కొనసాగించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. ఇంటర్వ్యూ ముగిసిన తరువాత బుమ్రాకు సంజన శుభాకాంక్షలు తెలియజేసింది. త్వరలోనే మళ్లీ కలుద్దాం అని చెప్పింది. వెంటనే బుమ్రా.. నేను మిమ్మల్ని 30 నిమిషాల తరువాత మళ్లీ కలుస్తాను అని అన్నాడు. దీంతో డిన్నర్ ఏక్కడ అంటూ సంజన అడిగింది. ప్రస్తుతం ఈ ఇంటర్వ్యూ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జస్ప్రీత్ బుమ్రా-సంజనా గణేశన్ 2013 ఐపీఎల్ సమయంలో మొదటిసారి కలుసుకున్నారు. 15 మార్చి 2021న వీరిద్దరు పెళ్లి చేసుకున్నారు. ఈ జంటకు అంగద్ జస్ప్రీత్ బుమ్రా అనే కొడుకు ఉన్నాడు.









Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com


TDP
TELUGU DESAM PARTY
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా
నేడు ప్రమాణ స్వీకారం చేయబోతున్న
టీడీపీ అధినేత
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి
హార్థిక
శుభాకాంక్షలు
సాయి నాగార్జున
తెలుగు యువత అధ్యక్షులు
మల్కాజ్‌గిరి పార్లమెంట్
బజారు హేమంత్ కుమార్ గౌడ్
తెలుగు యువత అధ్యక్షులు
ఉప్పల్ నియోజకవర్గం
పసల ప్రసాద్
TNTUC తెలంగాణ రాష్ట్ర
కార్యక్రమాల కార్యదర్శి
GUDAPATI FOUNDATION
గూడపాటి శరత్
చైర్మన్ - గూడపాటి ఫౌండేషన్